



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 1 సంచిక : 360 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : బాపట్ల శనివారం 29 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 360 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : BAPATLA SAT 29 AUGUST 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Bapatla,Ongole,Visakhapatnam,Kakinada,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## రాఖీ పండుగకు టీజీఎస్ఆర్టీసీ ఛార్జీల బాదుడు

- రాఖీ పండుగ సందర్భంగా టీజీఎస్ఆర్టీసీ ఛార్జీల పెంపు
- ప్రత్యేక బస్సుల్లో సాధారణ ఛార్జీపై 50 శాతం అదనం
- రాష్ట్రవ్యాప్తంగా 5,000 ప్రత్యేక బస్సు సర్వీసులు
- 1981 నాటి జీవో ప్రకారమే పెంపు అని అధికారుల వెల్లడి
- సాధారణ సర్వీసుల్లో ఛార్జీలు యథాతథం

- మిగతా 2లో




## రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన కొండా సురేఖ.. రాజకీయాలు మాట్లాడనని వ్యాఖ్య

- రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లిన కొండా సురేఖ
- రేవంత్ తో పాటు ఆయన అల్లుడు, మనవడికి రాఖీ కట్టిన సురేఖ
- రాష్ట్రంలోని ఆడబిడ్డల ఆశీస్సులు రేవంత్ కు ఉంటాయని వ్యాఖ్య

- మిగతా 2లో



### కన్నీళ్లతో కర్ణాటక మంత్రి పదవికి నాగేంద్ర రాజీనామా..

## రెండేళ్లలో ఇది రెండోసారి!

- వాల్మీకి కార్పొరేషన్ స్కామ్‌లో కర్ణాటక మంత్రి నాగేంద్ర రాజీనామా
- రెండు సంవత్సరాల్లో ఇదే ఆరోపణపై పదవి వీడటం ఇది రెండోసారి
- ప్రెస్ మీట్‌లో తన రాజీనామా ప్రకటిస్తూ కన్నీటిపర్యంతమైన కాంగ్రెస్ నేత
- బీజేపీకి గిరిజన వ్యతిరేక మనస్తత్వం ఉందంటూ నాగేంద్ర ఆరోపణ
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీజేపీ పాదయాత్రకు సన్నాహాలు

- మిగతా 2లో



## నేపాల్‌లో జల ప్రళయం.. 547కి చేరిన మృతుల సంఖ్య

- నేపాల్‌లో ఆకస్మిక వరదలు
- వందల మంది గల్లంతు, కొనసాగుతున్న గాలింపు చర్యలు
- భోటేకోషి నదిలో పెరుగుతున్న నీటిమట్టంతో సహాయక చర్యలకు ఆటంకం
- హిమానీనదం కూలడమే ఈ పెను విపత్తుకు కారణమని అనుమానం
- నేపాల్, చైనాతో పాటు పలు దేశాలు సహాయక చర్యల్లో భాగస్వామ్యం



పెన్ పవర్ డెస్క్:నేపాల్-టిబెట్ సరిహద్దులోని హిమాలయ ప్రాంతంలో సంభవించిన ఆకస్మిక వరదలు పెను విషాదాన్ని మిగిల్చాయి. ఈ జల ప్రళయంలో నేపాల్‌లో మరణించిన వారి సంఖ్య 547కి పెరిగినట్లు అధికారులు ధృవీకరించారు. వందలాది

- మిగతా 2లో

# నియోజకవర్గాల విజన్ ప్లాన్.. పనితీరుకు అదే ప్రామాణికం

- ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్
- ప్రజాప్రతినిధులు నిరంతరం సమీక్షలు జరుపుతూ ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఆదేశం
- అన్ని స్థాయిల్లో పొలిటికల్ గవర్నెన్స్, ప్రజా భాగస్వామ్యంతోనే మెరుగైన ఫలితాలు
- టెక్నాలజీని వాడుకుంటూ వినూత్నంగా ఆలోచించాలని సూచన
- రాష్ట్ర విజన్ ప్లాన్ యూనిట్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని వెల్లడి




పెన్ పవర్ డెస్క్:రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపడం, పేదరిక రహిత సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'స్వర్ణ నియోజకవర్గం విజన్ యాక్షన్ ప్లాన్' పనితీరుకు ప్రామాణికంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ ప్రణాళిక అమలులో ప్రజాప్రతినిధులు, అధికారులు కీలక పాత్ర పోషించాలని, ప్రజల భాగస్వామ్యంతోనే అద్భుత ఫలితాలు సాధించగలమని ఆయన దిశానిర్దేశం చేశారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లపై ముఖ్యమంత్రి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లతో పాటు యంగ్ ప్రొఫెషనల్స్, నాలెడ్జ్ పార్ట్‌నర్స్‌తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. నియోజకవర్గాల వారీగా నిర్దిష్ట విజన్ ప్లాన్‌ను రూపొందించుకుని అమలు చేయడం దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌లో ప్రప్రథమంగా జరుగుతోందని, ఈ వినూత్న కార్యక్రమానికి జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు లభించిందని ముఖ్యమంత్రి తెలిపారు. కీ-పెర్ఫామెన్స్ ఇండికేటర్లకు అనుగుణంగా ప్రతి రంగంలో వృద్ధి సాధించేలా పనిచేయాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. క్షేత్రస్థాయిలో నిర్వహించే సమీక్షలు మొక్కుబడిగా కాకుండా, ప్రజలకు పూర్తిగా జవాబుదారీగా ఉండేలా చూడాలని ఆదేశించారు. అన్ని స్థాయిల్లోనూ పొలిటికల్ గవర్నెన్స్ సమర్థవంతంగా అమలైనప్పుడే సుపరిపాలన సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ నిర్ణయాలు, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములను చేసినప్పుడు అద్భుత ఫలితాలు వస్తాయని, ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నమైన భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి లభించిన ప్రజా స్పందనే ఇందుకు నిదర్శనమని గుర్తుచేశారు. ఈ విజన్ ప్లాన్ అమలులో యంగ్ ప్రొఫెషనల్స్, నాలెడ్జ్ పార్ట్‌నర్లు, స్వర్ణ కార్యాలయాల సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని సీఎం పేర్కొన్నారు. సంప్రదాయ

- మిగతా 2లో

## పదోసారి సవాల్ చేస్తున్నా.. డేట్-టైమ్-ప్లేస్ ఫిక్స్ చెయ్ జగన్.. చర్చకు నేను రెడీ

- ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమన్వయ సమావేశంలో లోకేశ్
- ఏపీపీఎస్సీ, డీఎస్సీకి తేడా తెలియని అజ్ఞాని జగన్ అని విమర్శ
- సార్వత్రిక ఎన్నికల కన్నా 2 శాతం ఎక్కువ ఓట్లతో స్థానిక ఎన్నికల్లో గెలుస్తామన్న ధీమా
- జగన్ తప్పుడు పనుల వల్లే వైసీపీ నేతలు జైళ్లకు వెళుతున్నారని ఆరోపణ
- మరో మూడుసార్లు గెలిస్తేనే రాష్ట్రం గాడిన పడుతుందని వ్యాఖ్య



పెన్ పవర్ డెస్క్:"జగన్.. నీకు పదోసారి సవాల్ విసురుతున్నా. డేట్, టైమ్, ప్లేస్ ఫిక్స్ చెయ్. పులివెందులకు రమ్మన్నా వస్తా, తాడేపల్లిలోని నీ కొంపకు రమ్మన్నా వస్తా. చర్చకు నేను సిద్ధం, నువ్వు సిద్ధమా? ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియని నువ్వు నాకు నీతులు చెబుతావా?" అంటూ విద్యాశాఖ మంత్రి, తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమన్వయ సమావేశంలో ఆయన శుక్రవారం పాల్గొని ప్రసంగించారు. జగన్ లాంటి చేతకాని నాయకుడిని తాను ఎన్నడూ చూడలేదని, ఆయనకు నిజం చెబితే తల వెయ్యి ముక్కలయ్యే శాపం ఉందని ఎద్దేవా చేశారు.

- మిగతా 2లో

## పచ్చదనం సంకల్పాన్ని నాగబాబు సమర్థంగా నెరవేర్చాలి



- ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నాగబాబు
- రాష్ట్రంలో పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యమన్న పవన్
- ఈ భారీ ప్రాజెక్టును నాగబాబు సమర్థవంతంగా ముందుకు తీసుకెళతారని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా జనసేన ఎమ్మెల్సీ నాగబాబు కేబినెట్ హోదాతో బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా నాగబాబుకు ఆయన సోదరుడు,

- మిగతా 2లో

## గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన నాగబాబు




పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా ప్రముఖ నటుడు, జనసేన ఎమ్మెల్సీ నాగబాబు బాధ్యతలను స్వీకరించారు. మంగళగిరిలోని అరణ్యభవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో తన భార్య పద్మజతో

- మిగతా 2లో

## ఒంగోలు సమీపంలో రాడిసన్ 5 స్టార్ హోటల్: శంకుస్థాపన చేసిన మంత్రి నారా లోకేశ్

- రూ. 100 కోట్లతో చదలవాడ వద్ద 5 స్టార్ హోటల్
- రవిశంకర్ గ్రూప్, రవిప్రియ హాస్పిటాలిటీస్ ఎల్ఎల్‌పీ సంస్థల సంయుక్త భాగస్వామ్యంలో హోటల్
- హాస్పిటాలిటీ, టూరిజం, రవాణా, సేవా రంగాల్లో స్థానిక యువతకు ఉపాధి



పెన్ పవర్ డెస్క్:ఏపీ మంత్రి నారా లోకేశ్ ప్రకాశం జిల్లా పర్యటన సందర్భంగా ప్రాంతీయ అభివృద్ధికి సంబంధించి ఒక కీలక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ఒంగోలు పరిసర ప్రాంతమైన చదలవాడ వద్ద రూ. 100 కోట్ల అంచనా వ్యయంతో

- మిగతా 2లో

## తెలంగాణలో పెరిగిన క్రైమ్ రేట్.. ఆందోళనకరంగా ఆర్గనైజ్డ్ క్రైమ్, డ్రగ్స్ కేసులు

- తెలంగాణలో మూడేళ్లలో 7.15 శాతం పెరిగిన మొత్తం నేరాలు
- నార్కోటిక్స్ కేసులు 46 శాతం పెరగడంపై ఆందోళన
- సైబర్ క్రైమ్, ఆర్థిక నేరాల్లో కనిపించిన తగ్గుదల
- తీవ్రమైన నేరాలు తగ్గినా, సాధారణ నేరాలు పెరిగాయన్న గణాంకాలు




పెన్ పవర్ డెస్క్:తెలంగాణలో గత మూడేళ్లతో పోలిస్తే మొత్తం నేరాల సంఖ్య 7.15 శాతం మేర పెరిగింది. ముఖ్యంగా మాదకద్రవ్యాలు (నార్కోటిక్స్) సంబంధిత కేసులు

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

## : ఒకవైపు అధికార పార్టీ బలం..
## మరొకవైపు జగన్ హెచ్చరిక

స్థానిక సంస్థల ఎన్నికలు వైసీపీ నేతల కు ఫీవర్ తెచ్చి పెడుతున్నాయి. బలమైన అభ్యర్థులు, నమ్మకమైన నేతల కోసం ఇప్పటి నుంచే ఆరా తీస్తున్నారు. ప్రధానంగా పదహారు కార్పొరేషన్ లలో మేయర్ పదవి, మున్సిపల్ ఛైర్మన్ ల ఎంపిక వైసీపీ ఇన్ ఛార్జులకు తలనొప్పిగా మారనుంది. అధికార పార్టీని ఎదుర్కొనడం స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో అంత ఈజీ కాదు. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం అన్ని రకాలుగా బలంగా ఉంటుంది. ఆర్థికంగా, ఇటు అధికారుల నుంచి సహకారం, మరొకవైపు ఓటర్ల మనోగతం కూడా ఈ ఎన్నికల ఫలితాలను ప్రతిబింబిస్తాయి. మూడేళ్లు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటంతో తమకు ఎంతో కొంత మేలు, పనులు జరగాలంటే అధికార పార్టీని గెలిపించుకోవడం మంచిదని ప్రజలు సహజంగా విశ్వసిస్తారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ వైపు ప్రజలు మొగ్గు చూపుతారు.

**స్థానిక సంస్థల ఎన్నికలు కావడంతో...**

కూటమి ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తి సాధారణ ఎన్నికల వరకూ బయటపడదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అసంతృప్తి కనపరిస్తే తమ నగరం, పట్టణం అభివృద్ధి జరగదని భావిస్తారు. ఇక అధికార పార్టీ సామ, దాన, భేద, దండోపాయాలను ఖచ్చితంగా తమ విజయం కోసం ప్రయోగిస్తుంది. ఆ వత్తిడిని ఎదుర్కొని తట్టుకుని నిలబడే నేత కావాలంటే అధికారంలోని వైసీపీకి అంత సులువు కాదు. ఆర్థికంగా బలంగా ఉండాలి. తన తో పాటు తన వార్డు మెంబర్లకు కూడా ఆర్థిక సాయాన్ని అందించగల నేత అయి ఉంటేనే ఎంతో కొంత తట్టుకోగలరు. అలాగే పార్టీ పట్ల విధేయత, నాయకత్వం పట్ల నమ్మకం ఉన్న నేత కూడా అవసరం. లేకుంటే అధికార పార్టీ ప్రలోభాలకు లొంగిపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అందుకే అన్ని జాగ్రత్తలు వైసీపీ నేతలు తీసుకోవాల్సి ఉంటుంది.

**ప్రత్యక్ష ఎన్నిక కావడంతో...**

ఎందుకంటే ఈసారి మేయర్, ఛైర్మన్ల ఎన్నిక నేరుగా జరుగుతుంది. ప్రత్యక్ష ఎన్నికల ద్వారా జరిగే ఎంపిక కావడంతో ఖచ్చితంగా ప్రలోభాలకు చివరి నిమిషం వరకూ గురిచేస్తారు. ఏకగ్రీవం చేసుకోవాలన్నది అధికార పార్టీ పట్టుదలగా ఉంటుంది. మరొకవైపు ఏకగ్రీవమయితే వచ్చే ఎన్నికల్లో సీటు కూడా దక్కదన్న జగన్ హెచ్చరికలు వైసీపీ నేతల చెవుల్లో మారుమోగిపోతున్నాయి. అందుకే ఒకచోట ఇద్దరు నుంచి ముగ్గురు నేతలను ఎంపిక చేసి వారిలో చివరకు ఒకరిని బరిలో ఉంచితే మేలని వైసీపీ నియోజకవర్గ ఇన్ ఛార్జులు భావిస్తున్నారు. కానీ పార్టీ అధికారంలో లేకపోవడంతో ముగ్గురు బలమైన నేతలు దొరకడం అంత సులువు కాదు. తమ జేబులో డబ్బులు పెట్టాలంటే మరింత ఇబ్బంది పడతామని భావిస్తున్నారు. అందుకే వైసీపీ నియోజకవర్గాల ఇన్ ఛార్జుల పరిస్థితి ఒకింత ఆందోళనలో ఉన్నారు. అభ్యర్థుల ఎంపిక పూర్తయి ఎన్నికలు ముగిసే వరకూ వారికి టెన్షన్ తప్పదు.

## తెలంగాణలో పెరిగిన క్రైమ్ రేట్.. ఆందోళనకరంగా ఆర్గనైజ్డ్ క్రైమ్, డ్రగ్స్ కేసులు

- మొదటి పేజీ తరువాయి

46.10 శాతం పెరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. డీజీపీ సీవీ ఆనంద్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన అర్ధవార్షిక నేర సమీక్షా సమావేశంలో ఈ గణాంకాలను వెల్లడించారు. పోలీసు శాఖ విడుదల చేసిన వివరాల ప్రకారం, 2023-24లో 2,65,377గా నమోదైన మొత్తం కేసుల సంఖ్య, 2025-26 నాటికి 2,84,363కు చేరింది. ఇదే సమయంలో నార్కోటిక్స్ కేసులు 2,026 నుంచి 2,960కు పెరిగాయి. ఇక వ్యవస్థీకృత నేరాలు (ఆర్గనైజ్డ్ క్రైమ్) ఏకంగా 1,704 శాతం పెరుగుదలతో 25 నుంచి 451కి చేరడం గమనార్హం.కాగా, కొన్ని విభాగాల్లో నేరాలు గణనీయంగా తగ్గముఖం పట్టాయి. సైబర్ నేరాలు 13.29 శాతం, ఆర్థిక నేరాలు 13.28 శాతం తగ్గాయి. అలాగే హత్యలు, దోపిడీల వంటి తీవ్రమైన నేరాలు కూడా 10.33 శాతం మేర తగ్గాయి. ముఖ్యంగా హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఇటువంటి కేసులు నమోదు 26.23 శాతం తగ్గడం ఊరటనిచ్చే అంశం.మరోవైపు, చిన్నపాటి నేరాలు 7.28 శాతం పెరిగాయి. కొన్ని జిల్లాల్లో ఈ పెరుగుదల అధికంగా ఉంది. నార్కోటిక్స్ కేసుల పెరుగుదల పోలీసు శాఖకు పెద్ద సవాలుగా మారిందని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. కేవలం గణాంకాలకే పరిమితం కాకుండా, ప్రతి నేరం వెనుక ఉన్న కారణాలను లోతుగా విశ్లేషించాలని అధికారులను ఆదేశించారు. క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ (సీసీటీఎన్ఎస్) డేటా అప్‌డేట్ రేటు 96 శాతానికి చేరడంపై ఆయన సిబ్బందిని అభినందించారు. క్షేత్రస్థాయిలో పోలీసుల పనితీరులో వృత్తిపరమైన ప్రమాణాలు పాటించాలని, నేరాల కట్టడికి పటిష్ఠమైన ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేశారు.

## ఒంగోలు సమీపంలో రాడిసన్ 5 స్టార్ హోటల్: శంకుస్థాపన చేసిన మంత్రి నారా లోకేశ్

- మొదటి పేజీ తరువాయి

నిర్మించనున్న ప్రముఖ అంతర్జాతీయ బ్రాండ్ 'రాడిసన్' 5 స్టార్ హోటల్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ప్రసిద్ధ రవిశంకర్ గ్రూప్, రవిప్రియ హాస్పిటాలిటీస్ ఎల్ఎల్‌పీ సంస్థల సంయుక్త భాగస్వామ్యంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ ప్రతిష్టాత్మక హోటల్ రూపుదిద్దుకోనుంది.ఒంగోలు ప్రాంతంలో ఏర్పాటు కాబోతున్న మొదటి అంతర్జాతీయ బ్రాండెడ్ 5 స్టార్ హోటల్ ఇదే కావడం విశేషం. 151 విలాసవంతమైన గదులు, మల్టీ-క్యూసిన్ రెస్టారెంట్లు, ప్రీమియం బార్, లాంజ్, స్విమ్మింగ్ పూల్, స్పా, ఫిట్‌నెస్ సెంటర్ వంటి అత్యాధునిక సదుపాయాలతో దీనిని తీర్చిదిద్దుతున్నారు. అంతేకాకుండా, బిజినెస్ టూరిజం విస్తరణకు అనుగుణంగా 2,100 చదరపు మీటర్లకు పైగా విశాలమైన స్థలంలో భారీ బ్యాంకెట్ హాళ్లు, కాన్ఫరెన్స్ రూమ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. జాతీయ రహదారి-16కి అత్యంత సమీపంలో రూపుదిద్దుకుంటున్న ఈ ప్రాజెక్ట్ వల్ల పారిశ్రామికవేత్తలు, వ్యాపార ప్రతినిధులు, పర్యాటకులకు మెరుగైన వసతులు అందుబాటులోకి రానున్నాయి.ఈ విలాసవంతమైన 5 స్టార్ హోటల్ రాకతో ఒంగోలు, దాని పరిసర ప్రాంతాల్లో హాస్పిటాలిటీ, టూరిజం, రవాణా, సేవా రంగాల్లో స్థానిక యువతకు పెద్ద ఎత్తున ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. శంకుస్థాపన కార్యక్రమం అనంతరం లోకేశ్ పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలతో ఆత్మీయంగా మమేకమయ్యారు. అభిమానులతో ఫొటోలు దిగుతూ, వారి నుంచి వినతులను స్వీకరించారు. రక్షా బంధన్ సందర్భంగా పలువురు మహిళా కార్యకర్తలు లోకేశ్‌కు రాఖీలు కట్టి తమ శుభాకాంక్షలు తెలియజేశారు.

# నియోజకవర్గాల విజన్ ప్లాన్.. పనితీరుకు అదే ప్రామాణికం

- మొదటి పేజీ తరువాయి

ధోరణి వీడి వినూత్నంగా ఆలోచించాలని, స్థానిక వనరులను సద్వినియోగం చేసుకుంటూ ఆయా నియోజకవర్గాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఇందుకోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'డేటా లేక్' లోని సమాచారాన్ని విశ్లేషించుకోవాలని, టెక్నాలజీని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఆదేశించారు. ఉద్యోగుల సామర్థ్యం పెంచేందుకు ఇప్పటికే 1.50 కోట్ల ఆన్‌లైన్ కోర్సులు పూర్తి చేశారని తెలిపారు.ప్రభుత్వ లక్ష్యం కేవలం నగదు బదిలీ కాదని, లబ్ధిదారులను ఆర్థికంగా నిలబెట్టి వారిలో సాధికారత తీసుకురావడమేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ౹౼4 ప్రాజెక్టు ద్వారా పేదలకు అవసరమైన చేయూత అందిస్తున్నామని, ప్రతి నియోజకవర్గంలో తలసరి ఆదాయం పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ ప్రతి పేద కుటుంబానికి అండగా ఉంటామనే భరోసా కల్పించాలన్నారు. జిల్లాలకు, నియోజకవర్గాలకు వస్తున్న పరిశ్రమలు క్షేత్రస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించేలా (గ్రౌండింగ్) ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తిస్థాయిలో సహకరించాలని ఆదేశించారు.పేద, మధ్యతరగతి కుటుంబాలకు విద్య, వైద్యం భారంగా మారకుండా ఉండేందుకే 'తల్లికి వందనం', 'సంజీవని' వంటి పథకాలు తెచ్చామని సీఎం వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచడం వల్ల అదనంగా లక్ష మంది విద్యార్థులు చేరారని, ఇది వారి కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించిందని పేర్కొన్నారు. మెగా డీఎస్సీ ప్రక్రియకు అడ్డంకులు సృష్టించే ప్రయత్నాలు

జరిగినా, పారదర్శకంగా పూర్తి చేసి నిరుద్యోగ యువతకు న్యాయం చేశామని, దీనిపై విమర్శలు వస్తే టీచర్లే స్వయంగా ఉద్యమించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రజలను మెప్పించగలిగితే వారి నుంచి సహకారం కూడా అదే స్థాయిలో ఉంటుందని సీఎం ఉద్ఘాటించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థిక, ప్రణాళిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్, ఏపీఎస్‌డీపీఎస్ ఈడీ వీఆర్ అలపర్తి సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కన్నీళ్లతో కర్ణాటక మంత్రి పదవికి నాగేంద్ర రాజీనామా..
## రెండేళ్లలో ఇది రెండోసారి!

కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. తీవ్ర వివాదాస్పదమైన మహర్షి వాల్మీకి గిరిజన అభివృద్ధి కార్పొరేషన్ కుంభకోణం ఆరోపణల నేపథ్యంలో, రాష్ట్ర మంత్రి బి. నాగేంద్ర శుక్రవారం సాయంత్రం తన పదవికి రాజీనామా చేశారు. విలేకరుల సమావేశంలో తన నిర్ణయాన్ని ప్రకటిస్తూ ఆయన తీవ్ర భావోద్వేగానికి లోనై కన్నీటిపర్యంతమయ్యారు. గత రెండేళ్ల కాలంలో ఇదే ఆరోపణలపై ఆయన రాజీనామా చేయడం ఇది రెండోసారి కావడం గమనార్హం.ఈ కుంభకోణం నేపథ్యాన్ని పరిశీలిస్తే, వాల్మీకి కార్పొరేషన్‌లో సుమారు రూ. 89 కోట్ల మేర నిధులు అక్రమంగా బదిలీ అయ్యాయని ఆరోపణలు వచ్చాయి. 2024 మే నెలలో కార్పొరేషన్ అకౌంట్స్ అధికారి చంద్రశేఖరన్ ఆత్మహత్య చేసుకుంటూ రాసిన లేఖతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీంతో అప్పటి సిద్ధరామయ్య ప్రభుత్వంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న నాగేంద్ర, 2024 జూన్‌లో తొలిసారి తన పదవికి రాజీనామా చేశారు.

అయితే, డీకే శివకుమార్ ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన తర్వాత, 2026 ఆగస్టు 3న నాగేంద్రను తిరిగి మంత్రివర్గంలోకి తీసుకున్నారు. కానీ ప్రతిపక్ష బీజేపీ నుంచి తీవ్ర ఒత్తిడి ఎదురుకావడంతో ఆయన మరోసారి పదవిని వీడాల్సి వచ్చింది. ఈ సందర్భంగా

నాగేంద్ర మాట్లాడుతూ, రాజ్యాంగంపై తనకు పూర్తి నమ్మకం ఉందని, ఈ అంశంపై అసెంబ్లీలో చర్చకు తాము సిద్ధంగా ఉన్నా బీజేపీ ముందుకు రాలేదని విమర్శించారు. బీజేపీకి గిరిజన వ్యతిరేక మనస్తత్వం ఉందని, ఆ పార్టీ 'మనుస్మృతి'ని రుద్దాలని ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

మరోవైపు, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ సెప్టెంబర్ 1 నుంచి 10 వరకు రాయచూర్ నుంచి బళ్లారి వరకు పాదయాత్ర చేస్తామని బీజేపీ ఇప్పటికే ప్రకటించింది. ఈ యాత్రను కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రారంభించనున్నారు.

## నేపాల్‌లో జల ప్రళయం..
## 547కి చేరిన మృతుల సంఖ్య

- మొదటి పేజీ తరువాయి

మంది ఇప్పటికీ గల్లంతయ్యారని, వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. భోటేకోషి నదిలో నీటిమట్టం ప్రమాదకర స్థాయిలో పెరుగుతుండటంతో మళ్లీ వరదలు వచ్చే ప్రమాదం ఉందని, ఈ కారణంగా సహాయక బృందాలు అత్యంత జాగ్రత్తగా ముందుకు సాగుతున్నాయి.రసువా జిల్లాలో వరదల నుంచి ప్రాణాలతో బయటపడిన కస్టమ్స్ ఏజెంట్ రాజు బుధతోకి మాట్లాడుతూ, "భూమి ఒక్కసారిగా కంపించినట్లు అనిపించింది. కళ్ళు తెరిచేలోపే వరద నీరు ఉవ్వెత్తున ఎగిసిపడి ఇళ్లను తుడిచిపెట్టేసింది. ఈ ప్రమాదం నుంచి బయటపడటం నాకు పునర్జన్మ లాంటిది" అని ఆ భయానక క్షణాలను గుర్తుచేసుకున్నారు.ఈ విపత్తు ప్రభావం చైనా వైపున ఉన్న టిబెట్‌పైనా తీవ్రంగా పడింది. నేపాల్ సరిహద్దులోని పోర్టు వద్ద సంభవించిన వరదల్లో ఐదుగురు మరణించగా, 260 మంది విదేశీయులతో సహా 558 మంది గల్లంతయ్యారని చైనా అధికారులు ప్రకటించారు. ఈ ఘటనపై చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కమ్యూనిస్ట్ పార్టీ అత్యవసర సమావేశం నిర్వహించి సహాయక చర్యలపై సమీక్షించారు. నేపాల్‌లోని ఎత్తైన హిమానీనదం (గ్లేసియర్) ఒకటి కూలిపోవడం వల్లే ఈ విపత్తు సంభవించి ఉండవచ్చని చైనా ప్రాథమికంగా అంచనా వేస్తోంది. ఖాట్మండులోని శాస్త్రవేత్తలు కూడా ఇదే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. హిమానీనదం కూలిపోవడం, మంచు-రాళ్ల చరియలు విరిగిపడటంతో లెండే నదికి తాత్కాలికంగా ఆనకట్టలా అడ్డుపడిందని, అది ఒక్కసారిగా తెగిపోవడంతో, అక్కడ్నించి భోటేకోషి నదిలోకి ఈ స్థాయిలో వరద ప్రవాహం దూసుకొచ్చిందని భావిస్తున్నారు.

ఈ పెను విషాదంపై అంతర్జాతీయ సమాజం స్పందిస్తోంది. నేపాల్ ప్రధాని బాలేంద్ర షా, ఆయన కేబినెట్ మంత్రులు తమ ఒక నెల జీతాన్ని విపత్తు సహాయ నిధికి విరాళంగా ప్రకటించారు. ఖాట్మండులోని మహాకాళ్ శని భగవాన్ ఆలయంలో బాధితుల ఆత్మశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వరదల్లో చిక్కుకున్న భారత పర్యాటకులను భారత రాయబారి నవీన్ శ్రీవాస్తవ కలిసి ధైర్యం చెప్పారు. యునైటెడ్ కింగ్‌డమ్ 5 మిలియన్ పౌండ్ల ఆర్థిక సహాయంతో పాటు, అత్యవసర సహాయక బృందాలను పంపడానికి ముందుకొచ్చింది. గల్లంతైన వారిలో సుమారు 33 మంది బ్రిటిష్ పౌరులు ఉన్నట్లు సమాచారం. సరిహద్దుల్లో అంతర్జాతీయ సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

## పదోసారి సవాల్ చేస్తున్నా.. డేట్-టైమ్-ప్లేస్ ఫిక్స్ చెయ్ జగన్.. చర్చకు నేను రెడీ

**డీఎస్సీ, వెలిగొండపై ఘాటు విమర్శలు**

గత ప్రభుత్వంలో డీఎస్సీపై 150 కేసులు వేయించినా, తాము విజయవంతంగా పూర్తిచేసి ఉద్యోగాలు ఇచ్చామని లోకేశ్ గుర్తుచేశారు. "అది మా చిత్తశుద్ధి. మీరు నిర్వహించిన గ్రూప్-1 అవకతవకలపై కోర్టు పర్యవేక్షణలో విచారణ జరుగుతోంది. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని న్యాయస్థానమే చెప్పింది. ఈ ఏడాది మాత్రమే కాదు, రాబోయే మూడేళ్లు కూడా డీఎస్సీ నిర్వహిస్తాం. జగన్ వాళ్ల తాత వచ్చినా మమ్మల్ని అడ్డుకోలేరు" అని స్పష్టం చేశారు.

వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది చంద్రబాబేనని, త్వరలో పూర్తి చేసి ప్రారంభించేది కూడా చంద్రబాబేనని అన్నారు. పనులు పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేశారని, ఇప్పుడు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇచ్చి పనులు పూర్తి చేస్తుంటే క్రెడిట్ చోరీ అంటున్నారని మండిపడ్డారు.

**స్థానిక ఎన్నికల్లోనూ గెలుపే లక్ష్యం**

త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని లోకేశ్ పిలుపునిచ్చారు. "అందరం కలిసికట్టుగా పనిచేస్తే సార్వత్రిక ఎన్నికల కంటే 2 శాతం అదనపు ఓట్లతో ఘన విజయం సాధిస్తాం. కార్యకర్తలు నా చుట్టూ కాదు, ప్రజల చుట్టూ తిరగండి. పదవులు ఇచ్చే బాధ్యత నాది" అని భరోసా ఇచ్చారు. మై టీడీపీ యాప్ ద్వారా 4 లక్షల మంది నాయకులను పర్యవేక్షిస్తున్నామని, పార్టీ కార్యక్రమాలను సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. ఒంగోలు పోతురాజు కాల్వ, నల్లకాలువల అభివృద్ధికి వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. అహంకారంతో వ్యవహరిస్తే ప్రజలకు దూరం అవుతామని హితవు పలికారు.

**మరో మూడుసార్లు గెలవాలి**

రాష్ట్రాన్ని పూర్తిగా గాడిలో పెట్టాలంటే కనీసం మరో మూడుసార్లు వరుసగా టీడీపీ కూటమి గెలవాల్సిన అవసరం ఉందని లోకేశ్ అభిప్రాయపడ్డారు. "గత ఎన్నికల్లో జనసేన, బీజేపీలతో కలిసి 94 శాతం సీట్లు గెలిచాం. మన ఐక్యత ఇలాగే కొనసాగాలి. సోషల్ మీడియాలో ఒకరిపై ఒకరు పోస్టులు పెట్టుకుంటే రాష్ట్రమే నష్టపోతుంది" అని అన్నారు.

తనపై గత ప్రభుత్వం 23 తప్పుడు కేసులు పెట్టిందని, వాటిలో అటెంప్ట్ మర్డర్, ఎస్సీ, ఎస్టీ కేసులు కూడా ఉన్నాయని గుర్తుచేశారు. తాను జగన్‌లా కంచుకోటలో పోటీ చేయలేదని, 40 ఏళ్లలో గెలవని మంగళగిరిలో 91 వేల మెజారిటీతో గెలవడం తన సత్తా అని అన్నారు.

**జగన్ తప్పులకు వైసీపీ నేతల బలి**

జగన్ చేసిన తప్పుడు పనుల వల్లే కొందరు వైసీపీ నాయకులు ఈరోజు జైళ్లకు వెళుతున్నారని, ఇప్పుడు వారంతా కులం కార్డు వాడుతున్నారని లోకేశ్ ఆరోపించారు. బీసీలకు 10 శాతం రిజర్వేషన్లు తగ్గించి 17 వేల మందికి పదవులు రాకుండా అడ్డుకున్నారని విమర్శించారు. అమర్‌నాథ్ గౌడ్, నందం సుబ్బయ్య, తోట చంద్రయ్య హత్యలను ప్రస్తావిస్తూ వైసీపీ పాలనలో అరాచకాలు పెరిగాయన్నారు. మాజీ మంత్రులు సీదిరి అప్పలరాజు, కారుమూరి నాగేశ్వరరావుల ఉదంతాలను ఉటంకిస్తూ.. వారు చేసిన తప్పుల వల్లే చట్టపరమైన చిక్కుల్లో పడ్డారని, దీనికి ప్రభుత్వానికి సంబంధం లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, పలువురు టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రాష్ట్రం ప్రస్తుతం కఠిన పరిస్థితుల్లో ఉందని, రూపాయి ఆదాయంలో 94 పైసలు జీతాలకే పోతోందని, అయినా చంద్రబాబు రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా నిలపడానికి అహర్నిశలు శ్రమిస్తున్నారని లోకేశ్ తెలిపారు.

## రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన కొండా సురేఖ..
## రాజకీయాలు మాట్లాడనని వ్యాఖ్య

తెలంగాణ రాజకీయాల్లో గత కొన్ని రోజులుగా తీవ్ర దుమారం రేపిన పరిణామాల మధ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కొండా సురేఖల భేటీ పొలిటికల్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. పరకాల నియోజకవర్గ వివాదంలో కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ నేరుగా సీఎం రేవంత్‌పై చేసిన వ్యాఖ్యలు, ఆపై పీసీసీ క్రమశిక్షణా కమిటీ చర్యలకు సిద్ధమవ్వడం కాంగ్రెస్‌లో తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే. కేబినెట్ నుంచి సురేఖపై వేటు పడుతుందనే ప్రచారం జరుగుతున్న తరుణంలో, రాఖీ పండుగను పురస్కరించుకుని ఆమె నేరుగా సీఎం నివాసానికి వెళ్లడం విశేషం.ఈ సందర్భంగా రేవంత్ రెడ్డితో పాటు ఆయన మనవడికి, అల్లుడికి కొండా సురేఖ ఎంతో ఆత్మీయంగా రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఈ పవిత్రమైన పండుగ రోజున ఎలాంటి రాజకీయాల గురించి మాట్లాడనని స్పష్టం చేశారు. తాను అందరికీ సోదరినని, రాష్ట్రంలోని ఆడబిడ్డల ఆశీస్సులు, అండదండలు సీఎం రేవంత్ రెడ్డికి ఎల్లవేళలా ఉంటాయని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని మరిన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే శక్తిని, ఆయురారోగ్యాలను ఆయనకు ప్రసాదించాలని దేవుడిని కోరుకున్నట్లు సురేఖ తెలిపారు.

## రాఖీ పండుగకు టీజీఎస్ఆర్టీసీ ఛార్జీల బాదుడు

రాఖీ పౌర్ణమి వేళ ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినప్పటికీ, టికెట్ ధరలను భారీగా పెంచడంపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. పండుగ పూట తమ స్వగ్రామాలకు వెళ్లే సామాన్య ప్రయాణికులకు ఈ అదనపు ఛార్జీల బాదుడు భారంగా మారింది.రాఖీ పండుగను పురస్కరించుకుని ఆగస్టు 27 నుంచి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 5,000 ప్రత్యేక బస్సులను నడపాలని టీజీఎస్ఆర్టీసీ నిర్ణయించింది. అయితే, ఈ బస్సుల్లో సాధారణ ఛార్జీల కంటే 50 శాతం అదనంగా వసూలు చేస్తున్నారు. ఉదాహరణకు, మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్) నుంచి జడ్చర్లకు సాధారణ ఛార్జీ రూ. 150 ఉండగా, ప్రత్యేక బస్సుల్లో దానిని రూ. 190కి పెంచారు. అదేవిధంగా, కరీంనగర్‌కు వెళ్లే సూపర్ డీలక్స్ బస్సులో సాధారణ టికెట్ ధర రూ. 300 ఉండగా, ప్రస్తుతం రూ. 400 వసూలు చేస్తున్నారు. ఛార్జీల పెంపుపై ముందస్తు సమాచారం లేకపోవడంతో బస్సు ఎక్కిన తర్వాత తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ధరల పెంపుపై ముందే ప్రకటన విడుదల చేస్తే బాగుండేదని పలువురు ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు. ఈ అంశంపై టీజీఎస్ఆర్టీసీ పీఆర్వో ప్రసన్న స్పందిస్తూ వివరణ ఇచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హయాంలో 1981లో వెలువడిన ప్రభుత్వ ఉత్తర్వుల (జీవో) ప్రకారం, పండుగ సమయాల్లో నడిపే ప్రత్యేక బస్సుల్లో సాధారణ ధర కంటే 1.5 రెట్లు అధికంగా వసూలు చేసే వెసులుబాటు సంస్థకు ఉందని ఆమె స్పష్టం చేశారు.

## పచ్చదనం సంకల్పాన్ని నాగబాబు సమర్థంగా నెరవేర్చాలి

- మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పచ్చదనంతో కళకళలాడే ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించాలనే ఆశయంతో కూటమి ప్రభుత్వం ఈ ప్రత్యేక నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసిందని, ప్రకృతిపై ఎంతో ప్రేమ ఉన్న నాగబాబు ఈ బృహత్తర బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. 2047 నాటికి రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో పచ్చదనాన్ని ఏకంగా 50 శాతానికి పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ భారీ ప్రాజెక్టును నాగబాబు ముందుకు తీసుకెళతారని పవన్ పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణను కేవలం ఒక ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ఒక ప్రజా ఉద్యమంగా మలిచే బాధ్యతలో ఆయన పూర్తి విజయం సాధించాలని ఆకాంక్షించారు.

మరోవైపు, నాగబాబుకు కేబినెట్ హోదా కల్పిస్తూ ఏపీ గ్రీన్ కమిటీ ఛైర్మన్‌గా నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకి, అందుకు మద్దతు తెలిపిన కూటమి భాగస్వామ్య పక్షాల నాయకులకు పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన నాగబాబు

- మొదటి పేజీ తరువాయి

కలిసి పాల్గొన్న ఆయన... వేదపండితుల మంత్రోచ్చారణలు, ప్రత్యేక పూజల నడుమ పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం వేదపండితులు ఆయనకు వేదాశీర్వచనం అందించారు.రాష్ట్ర పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఏపీ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న 'ఏపీ గ్రీన్' ప్రాజెక్టును ముందుకు నడిపేందుకు నాగబాబుకు ఈ కీలక బాధ్యతలను అప్పగించారు. 2047 నాటికి రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో అటవీ, పచ్చదనం శాతాన్ని ఏకంగా 50 శాతానికి పెంచాలనే భారీ లక్ష్యంతో ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌ను వేగవంతం చేసేందుకు గాను నాగబాబుకు కేబినెట్ హోదా హోదాతో కూడిన బాధ్యతలను అప్పగించింది.బాధ్యతలు స్వీకరించిన అనంతరం నాగబాబును పలువురు ఐఏఎస్ అధికారులు, అటవీ శాఖ సీనియర్ అధికారులు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు మర్యాదపూర్వకంగా కలిశారు. పీసీసీఎఫ్ చలపతిరావు, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజలతో పాటు ఇతర ప్రభుత్వ సలహాదారులు, ప్రముఖులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# పడతడికలో అక్రమ మట్టి రవాణా?



## - అధికారుల తీరుపై గ్రామస్థుల ఆగ్రహం

**కృత్తివెన్ను, పెన్ పవర్, ఆగస్టు 28**

కృత్తివెన్ను మండలంలోని పడతడిక గ్రామ పరిధిలో అక్రమ మట్టి తవ్వకాలు, రవాణా జరుగుతున్నాయంటూ గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అనుమతులు, నిబంధనలను పట్టించుకోకుండా మట్టిని తవ్వి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారని వారు పేర్కొంటున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారంటూ గ్రామస్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.అధికార పార్టీకి చెందిన కొందరు నాయకుల కనుసన్నల్లోనే మట్టి దందా కొనసాగుతోందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అధికారుల దృష్టికి పలుమార్లు సమస్యను తీసుకెళ్లినా ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించడం లేదని వారు అంటున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా మట్టి తరలింపు జరుగుతుండటంతో గ్రామీణ రహదారులు దెబ్బతింటున్నాయని, భారీ వాహనాల రాకపోకలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు.అక్రమ మట్టి తవ్వకాల వల్ల పర్యావరణానికి, భూగర్భ జలాలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, అనుమతులు లేకుండా తవ్వకాలు జరుగుతున్నాయా లేదా అనే అంశాన్ని పరిశీలించాలని వారు కోరుతున్నారు. అక్రమాలు నిర్ధారణైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారుల వివరణ కోసం సంప్రదించగా వారు చరవాణిలో అందుబాటులో లేరు.

పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
ఎన్.టి.ఆర్ జిల్లా । కృష్ణా । గుంటూరు । పల్నాడు । బాపట్ల

# దివ్యాంగుల గోడు అధికారులకు పట్టదా?

**- రెండేళ్లుగా డ్వాక్రా సంఘాల ఏర్పాటుకు ఎదురుచూపులు**

**- నిర్లక్ష్యంపై ఏపీఎంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**



**వేటపాలెం, పెన్ పవర్, ఆగస్టు 28:**

దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తున్నప్పటికీ.. వేటపాలెం మండలంలో అర్హులైన దివ్యాంగులకు ఆ పథకాల ప్రయోజనాలు అందేలా స్వయం సహాయక సంఘాల ఏర్పాటు జరగడం లేదని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్ కాలేషా ఆరోపించారు. దాదాపు రెండేళ్లుగా దివ్యాంగుల స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు అధికారులు చొరవ చూపకపోవడంతో అర్హులైన దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

ఈ సమస్యపై శుక్రవారం వేటపాలెం మండల పరిషత్ అభివృద్ధి అధికారి పాశం రాజారావును కలిసి వినతిపత్రం అందజేశారు. మండలంలో గ్రామీణ అభివృద్ధి శాఖ (వెలుగుడ్వాక్రా) ద్వారా అర్హులైన దివ్యాంగులకు స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహించిన ఏపీఎం కాటి అంజిబాబుపై తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను కోరారు.

కాలేషా మాట్లాడుతూ.. వేటపాలెం మండలంలో దివ్యాంగుల స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయాలని గతంలో పలుమార్లు సంబంధిత అధికారులను కలిసి విజ్ఞప్తి చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. వినతిపత్రాలు స్వీకరించి కూడా చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చినప్పటికీ వాటిని అమలు చేయడంలో జాప్యం చేస్తున్నారని పేర్కొన్నారు.

పక్క మండలాల్లో సంక్షేమ పథకాల అమలు

పక్కనే ఉన్న చిన్నగంజాం మండలంలో దివ్యాంగుల స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసి, వాటి ద్వారా అర్హులకు వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందిస్తున్నారని కాలేషా తెలిపారు. అయితే వేటపాలెం మండలంలో మాత్రం దివ్యాంగుల సంఘాల ఏర్పాటు విషయంలో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోందని విమర్శించారు. దీంతో అర్హులైన దివ్యాంగులు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందలేక నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

చట్టం ఉన్నా.. అమలు ఏదీ?

దివ్యాంగుల హక్కుల చట్టం2016 ప్రకారం దివ్యాంగులకు సమాన అవకాశాలు, సంక్షేమం, సాధికారత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉందని కాలేషా గుర్తుచేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండలంలోని అర్హులైన దివ్యాంగులను గుర్తించి నూతనంగా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఇప్పటివరకు జరిగిన జాప్యంపై విచారణ జరిపి, నిర్లక్ష్యానికి బాధ్యులైన అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

దివ్యాంగుల సమస్యలను ఇకనైనా నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే పరిష్కరించాలని, స్వయం సహాయక సంఘాల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేసి వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను కోరారు.

ఈ కార్యక్రమంలో నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి జిల్లా అధ్యక్షులు ఇరుపని వెంకటేశ్వర్లు, పి. అనిల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# డయేరియా బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే బోడె ప్రసాద్



**పెన్ పవర్, కృష్ణాజిల్లా, కంకిపాడు ఆగస్టు 28**

కంకిపాడు పరిసర ప్రాంతాల్లో గత నాలుగు రోజులుగా డయేరియా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ శుక్రవారం కంకిపాడు ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ.. గత నాలుగు రోజుల్లో కంకిపాడు ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలో మొత్తం 25 డయేరియా కేసులు నమోదయ్యాయని తెలిపారు. వీరిలో ఇప్పటివరకు 13 మంది డిశ్చార్జ్ కాగా, ఇద్దరు అవుట్ పేషెంట్లుగా చికిత్స పొందుతున్నారని, మరో 10 మంది ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని వివరించారు.మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి డయేరియా కేసులు నమోదవుతున్నాయని తెలిపారు. పరిస్థితిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.డయేరియా కేసుల నేపథ్యంలో కంకిపాడు పరిధిలోని మాంసం దుకాణాల్లో కూడా తనిఖీలు చేపట్టామని తెలిపారు. పంచాయతీ పైపులైన్ల ద్వారా సరఫరా అవుతున్న తాగునీటి నమూనాలను పరీక్షల కోసం పంపించామని పేర్కొన్నారు.పంచాయతీ సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలు చేపట్టడంతో పాటు బ్లీచింగ్ పౌడర్ చల్లాలని అధికారులను ఆదేశించినట్లు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తెలిపారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తాగునీటిని జాగ్రత్తగా వినియోగించాలని సూచించారు.



# పసికందు ప్రాణాలకు.. ఏలూరి భరోసా

**- రూ.3.84 లక్షల సీఎంఆర్ఎఫ్ సాయం మంజూరు**

**-పేద కుటుంబానికి అండగా నిలిచిన ఎమ్మెల్యే ఏలూరి**



బలహీనంగా జన్మించిన చిన్నారికి మెరుగైన వైద్యం

**పర్చూరు, పెన్ పవర్, ఆగస్టు 28:**

పుట్టిన మూడు రోజులకే అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పసికందుకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆపన్నహస్తం అందించారు. ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి రూ.3,84,633 ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకుని ఆ కుటుంబానికి భరోసా కల్పించారు.

పర్చూరు గ్రామం నెహ్రూనగర్‌కు చెందిన షేక్ యూసఫ్, షేక్ నన్నిభి దంపతులకు మూడు రోజుల క్రితం ఆడబిడ్డ జన్మించింది. తక్కువ బరువుతో, అవసరమని వైద్యులు సూచించారు. ప్రత్యేక బాక్స్‌లో ఉంచి చికిత్స అందించాల్సి ఉండటంతో కుటుంబ సభ్యులు చిన్నారిని చిలకలూరిపేటలోని వరలక్ష్మి ఆసుపత్రికి తరలించారు.చిన్నారికి మెరుగైన వైద్యం అందించేందుకు అయ్యే ఖర్చులు పేద కుటుంబానికి భారంగా మారాయి. దీంతో ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును ఆశ్రయించారు.విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఏలూరి వెంటనే స్పందించి సీఎంఆర్ఎఫ్ ద్వారా లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసీ)తో రూ.3,84,633 ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకున్నారు. దీంతో చిన్నారి వైద్యానికి అవసరమైన ఆర్థిక భరోసా లభించింది.పుట్టిన బిడ్డ ఆరోగ్యంగా కోలుకోవాలని ఎదురుచూస్తున్న తల్లిదండ్రులకు ఈ సాయం కొండంత అండగా నిలిచింది. ఆపదలో ఉన్న తమ కుటుంబాన్ని ఆదుకున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఉచిత హోమియో వైద్య శిబిరానికి విశేష స్పందన

**- రోగులను పరిశీలించి ఉచితంగా హోమియో మందుల పంపిణీ**
**- డాక్టర్ చంద్రశేఖర్‌కు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపిన రెడ్‌క్రాస్ సోదరీమణులు**






**బాపట్ల, పెన్ పవర్,ఆగస్టు 28:**

బాపట్ల జిల్లాలోని రెడ్‌క్రాస్ సొసైటీ భవనంలో శుక్రవారం ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో, రెడ్‌క్రాస్ సొసైటీ సౌజన్యంతో ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ రోగులను పరీక్షించి, అనంతరం ఉచితంగా హోమియో మందులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ దీర్ఘకాలిక, తాత్కాలిక వ్యాధులతో పాటు చాలాకాలంగా తగ్గని మొండి వ్యాధులకు ప్రభుత్వ హోమియో వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. బాపట్ల పట్టణం, పరిసర ప్రాంతాల ప్రజలు ఉచిత హోమియో వైద్య శిబిర సేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు.రక్షాబంధన్ వేడుకలను పురస్కరించుకుని రెడ్‌క్రాస్ సొసైటీ సోదరీమణులు లావణ్య, సిఫోరా, ప్రియాంక డాక్టర్ చంద్రశేఖర్‌కు రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మరింత ఉన్నత శిఖరాలకు చేరుకుని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ నారాయణ బట్టు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నూతన గృహంలో ఎమ్మెల్యే మద్దులూరి దంపతుల గృహప్రవేశం

**కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు, హోమం, సత్యనారాయణ స్వామి వ్రతం**





**చీరాల, పెన్ పవర్, ఆగస్టు 28:**

చీరాల పట్టణంలోని కొత్తపేటలో చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య, బాలకొండమ్మ దంపతులు నూతన గృహప్రవేశం నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి వేద పండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు.

ఈ సందర్భంగా నూతన గృహంలో గణపతి పూజ, హోమం, వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం సత్యనారాయణ స్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కుటుంబ సభ్యులంతా పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య, బాలకొండమ్మ దంపతులతో పాటు వారి కుమారులు గౌరీ అమర్నాథ్, మహేంద్ర నాథ్, అల్లుడు త్రినాథ్ కుమార్ (ఐ.ఎఫ్.ఎస్.), కుమార్తె దేవి తదితరులు గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్నారు.నూతన గృహంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని వేద పండితులు ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు ఎమ్మెల్యే దంపతులకు నూతన గృహప్రవేశ శుభాకాంక్షలు తెలిపారు. పూజా కార్యక్రమాలతో కొత్త ఇంట్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# ఎమ్మెల్యే ఏలూరికి రాఖీ కట్టిన డ్వాక్రా మహిళలు



## ఆత్మీయతకు ప్రతీక రక్షాబంధన్ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

**పర్చూరు, పెన్ పవర్, ఆగస్టు 28:**

రక్షాబంధన్ (రాఖీ పౌర్ణమి) పర్వదినాన్ని పురస్కరించుకుని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు డ్వాక్రా మహిళలు రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సనాతన సంప్రదాయ పద్ధతిలో ఎమ్మెల్యేకు రాఖీలు కట్టి, ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

అనంతరం ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, బంధువులు, అక్కాచెల్లెళ్లు సైతం ఏలూరి సాంబశివరావుకు రాఖీలు కట్టి ఆప్యాయంగా శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు రాష్ట్ర ప్రజలందరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య అనురాగం, ఆత్మీయతకు రక్షాబంధన్ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. రాఖీ పండుగ సోదర సోదరీమణుల అనుబంధాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు సమాజంలో ప్రేమ, ఐకమత్యం, సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు.మానవ సంబంధాలు, నైతిక విలువలు, పరస్పర గౌరవాన్ని పెంపొందించే గొప్ప పర్వదినం రక్షాబంధన్ అని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, సోదరభావంతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు.



## పొన్నూరు రోడ్డులో విద్యుత్ అంతరాయానికి

# సాంకేతిక లోపమే కారణం ఎమ్మెల్యే నసీర్ అహ్మద్



**గుంటూరు: పెన్ పవర్, ఆగస్ట్,28,**

పొన్నూరు రోడ్ సబ్‌స్టేషన్‌లో సూపర్ బజార్ ఫీడర్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఫీడర్ లోపం ఇతర ఫీడర్లపై ప్రభావం చూపడంతో డెడ్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి కండక్టర్ తెగిపోయినట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.సమాచారం అందుకున్న వెంటనే అర్ధరాత్రి 12 గంటలకు విద్యుత్ శాఖ అధికారులతో కలిసి సబ్‌స్టేషన్‌ను సందర్శించి పరిస్థితిని పరిశీలించినట్లు గుంటూరు తూర్పు నియోజకవర్గ ప్రజాప్రతినిధి తెలిపారు. విద్యుత్ అంతరాయానికి గల సాంకేతిక కారణాలు, అధికారులు చేపట్టిన చర్యలు, సరఫరా పునరుద్ధరణ ప్రక్రియను విద్యుత్ శాఖ అధికారి వివరించారు. ప్రజలకు వాస్తవ పరిస్థితి తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ వివరాలను వెల్లడించినట్లు తెలిపారు.విద్యుత్ అంతరాయం కారణంగా గుంటూరు తూర్పు నియోజకవర్గ ప్రజలకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు తెలియజేస్తూ, ప్రజల సమస్యల పరిష్కారమే తన బాధ్యతని, సమస్య ఎక్కడ ఉన్నా పరిష్కారం అయ్యే వరకు ప్రయత్నం కొనసాగిస్తానని పేర్కొన్నారు.



# తిరుపతిలో అమరావతి ఛాంపియన్‌షిప్..

## పల్నాడు జిల్లా కబడ్డీ జట్టుకు ప్రథమ స్థానం




**చిలకలూరిపేట , పెన్ పవర్, ఆగస్టు 28 :**
తిరుపతిలో నిర్వహించిన అమరావతి ఛాంపియన్‌షిప్ అండర్18 విభాగం కబడ్డీ పోటీల్లో పల్నాడు జిల్లా జట్టు సత్తా చాటి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఫైనల్ మ్యాచ్‌లో శ్రీకాకుళం జిల్లా జట్టుపై అద్భుతంగా పోరాడి విజయం సాధించి ఛాంపియన్‌షిప్ ట్రోఫీని సొంతం చేసుకుంది.మ్యాచ్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగగా, పల్నాడు జిల్లా క్రీడాకారులు సమిష్టి కృషితో రాణించి శ్రీకాకుళం జట్టును ఓడించి విజేతగా నిలిచారు.ఈ విజయానికి కోచ్‌లు ఎనుగంటి సురేష్, దారా మహేష్ అందించిన శిక్షణ, మార్గదర్శకత్వం కీలకంగా నిలిచింది. క్రీడాకారుల ప్రతిభ, పట్టుదల, సమిష్టి కృషితో పల్నాడు జిల్లా జట్టు ఈ ఘన విజయాన్ని సాధించింది.పల్నాడు జిల్లా అండర్18 కబడ్డీ జట్టు సాధించిన ఈ విజయంపై క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ క్రీడాకారులు, కోచ్‌లు ఎనుగంటి సురేష్, దారా మహేష్‌లకు అభినందనలు తెలిపారు.

# శ్రావణ శుక్రవారం సందర్భంగా మహాలక్ష్మమ్మకు విశేష పుష్పాలంకరణ



**వేటపాలెం, పెన్ పవర్, ఆగస్టు 28:**
వేటపాలెం గ్రామం ఆనుమల్లిపేటలోని శ్రీ మహాలక్ష్మమ్మ చెట్టు మందిరం వద్ద శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని 11 రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
మహిళల ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక పూజా కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తిశ్రద్ధలతో సందడిగా మారింది. అమ్మవారి అనుగ్రహంతో కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు.
కార్యక్రమంలో మహిళా విభాగానికి చెందిన రాజ్యలక్ష్మి, సత్యవతి, భారతి, అనంతలక్ష్మి, స్రవంతి, బాంధవి తదితరులు పాల్గొన్నారు.

# చీరాల ప్రభుత్వ వైద్యశాలలో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం



**చీరాల, పెన్ పవర్, ఆగస్టు 28:**
బాపట్ల జిల్లా చీరాల ప్రభుత్వ వైద్యశాలలో ఒంగోలుకు చెందిన హెచ్‌సీజీ ఎంఎన్ఆర్ క్యాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి క్యాన్సర్ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న పలువురు రోగులు హాజరై వైద్య సేవలు పొందారు.ఈ సందర్భంగా ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ తేజస్విని మాట్లాడుతూ ఒంగోలులోని తమ క్యాన్సర్ ఆసుపత్రిలో పేద ప్రజలకు, ఆరోగ్యశ్రీ కార్డుదారులకు క్యాన్సర్ చికిత్సను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించడంతో పాటు, వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి మెరుగైన చికిత్స అందించాలనే ఉద్దేశంతో ప్రతి నెల నాలుగో శుక్రవారం చీరాల ప్రభుత్వ వైద్యశాలలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు.ఆరోగ్యశ్రీ పథకం కింద అర్హులైన ప్రతి ఒక్కరికీ క్యాన్సర్‌కు సంబంధించిన చికిత్సలు అందుబాటులో ఉన్నాయని డాక్టర్ తేజస్విని పేర్కొన్నారు. ప్రజలు క్యాన్సర్ లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ సీహెచ్ శరత్ బాబు పాల్గొన్నారు.

# గుంటూరు ఛానల్ పూర్తి చేసే బాధ్యత నాదే

## పర్చూరు వరకు పొడిగింపుపై రాజీ లేదు: ఎమ్మెల్యే ఏలూరి



**పర్చూరు, పెన్ పవర్, ఆగస్టు 28:**
గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించే విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తే లేదని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్పష్టం చేశారు. ఏడు దశాబ్దాలుగా ఈ ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్న గుంటూరు ఛానల్ విస్తరణ కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందని తెలిపారు.
గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించడం ద్వారా నియోజకవర్గంలోని సుమారు 28 వేల ఎకరాలకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించడమే ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే రైతులకు శాశ్వతంగా నీటి భరోసా కలుగుతుందని, వ్యవసాయ రంగానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అన్నారు.
ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం గుంటూరు ఛానల్ విస్తరణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఏలూరి తెలిపారు. ప్రాజెక్టును పూర్తి చేయడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు తీసుకురావడం తన ప్రధాన బాధ్యతగా భావిస్తున్నానని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఈ విషయంలో రైతులు ఎలాంటి అపోహలకు గురికావాల్సిన అవసరం లేదని, వారి ప్రయోజనాలను కాపాడుతూ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

# పీ.జీ.ఆర్.ఎస్ పై ప్రజల్లో నమ్మకం పెరిగింది : ప్రత్తిపాటి

- సమస్యల పరిష్కారంలో వ్యవస్థల పనితీరుపై వారు సంతృప్తితో ఉన్నారు.
- ప్రజలు ఎదుర్కొనే సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి.
- రాఖీ పౌర్ణమి సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్తిపాటికి రాఖీలు కట్టిన తెలుగు మహిళలు.

**చిలకలూరిపేట , పెన్ పవర్, ఆగస్టు 28 :**
ప్రజా సమస్యల పరిష్కారాన్ని తమతో పాటు అధికారులు వారి బాధ్యతగా భావించాలని, తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులనే ప్రజలు మన దృష్టికి తీసుకొస్తారనే వాస్తవాన్ని గ్రహించాలని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన పీ.జీ.ఆర్.ఎస్ (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రస్సెల్ సిస్టమ్) వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరిగిందని, ప్రభుత్వ వ్యవస్థల పనితీరుపై వారు సంతృప్తిగా ఉన్నారని ఆయన తెలిపారు.
శుక్రవారం ఆయన తన నివాసంలో గ్రీవెన్స్ నిర్వహించి, ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్హులైన కొందరు తమకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందించాలని కోరగా.. అక్టోబర్లో ప్రభుత్వం 3 లక్షల కొత్త పింఛన్లు మంజూరు చేయనుందని, అన్ని అర్హతలున్న వారికి తప్పకుండా న్యాయం చేస్తామని ప్రత్తిపాటి హామీ ఇచ్చారు.
అనంతరం ప్రజలు అందించిన వినతుల్ని పరిశీలించిన ప్రత్తిపాటి... వాటిలోని సమస్యల్ని స్వయంగా అధికారులకు తెలియచేశారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆయన అధికారుల్ని ఆదేశించారు.
ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ...
ప్రభుత్వ యంత్రాంగం, ప్రజాప్రతినిధులు సహా స్వయంగా తన దృష్టికి వచ్చే ప్రజా సమస్యల అర్జీల పరిష్కారంపై ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ పెట్టారని చెప్పారు. ప్రభుత్వ డాష్ బోర్డు, ఆర్.టీ.జీ.ఎస్ ద్వారా ఆయన ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కార తీరుని శాఖల వారీగా పరిశీలిస్తున్నారని ప్రత్తిపాటి తెలిపారు. ఎక్కడైనా యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వెంటనే చర్యలు తీసుకుంటున్నారని, ఈ విషయంలో ప్రజా ప్రతినిధుల్ని కూడా సీఎం వదిలిపెట్టడం లేదని ప్రత్తిపాటి స్పష్టం చేశారు.
ప్రత్తిపాటికి రాఖీ కట్టిన తెలుగు మహిళలు..
రక్షా బంధన్ ను పురస్కరించుకొని నియోజకవర్గ తెలుగు మహిళలు శుక్రవారం ప్రత్తిపాటికి స్వయంగా రాఖీలు కట్టారు. ఎమ్మెల్యే నివాసానికి వచ్చిన తెలుగు మహిళలు.. ప్రత్తిపాటికి శుభాకాంక్షలు తెలిపి, తమ వెంట తెచ్చిన రాఖీలు కట్టి, ఆయనకు మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా వారు ప్రత్తిపాటితో తమకున్న ప్రత్యేక అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఎమ్మెల్యేకు





తెలుగు మహిళా నాయకులు రాఖీలు కట్టారు.

# రూ.1.25 కోట్లతో సకల హంగులతో నిర్మించిన చేపల మార్కెట్ ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి.

- గత పాలకుల నిర్లక్ష్యమే.. పట్టణ పారిశుధ్య వ్యవస్థను దిగజార్చింది. : ప్రత్తిపాటి
- కూటమి ప్రభుత్వం వచ్చాకే ప్రజల్లో చైతన్యం వచ్చి, పారిశుధ్యం మెరుగుపడింది.
- మత్స్య ఉత్పత్తుల విక్రయాల కోసమే ప్రత్యేకంగా మోడరన్ ఫిష్ మార్కెట్ నిర్మించాం.
- ఇకపై ఎవరూ ప్రధాన రోడ్లు, వీధుల్లో క్రయవిక్రయాలు జరపడానికి వీల్లేదు.

**చిలకలూరిపేట , పెన్ పవర్, ఆగస్టు 28 :**
గత పాలకుల నిర్లక్ష్యం, అశ్రద్ధతో పట్టణవీధులు వ్యర్థాలు, చెత్తకుప్పలతో నిండిపోయాయని, ప్రజల ఆరోగ్యంతో పాటు.. పట్టణ పారిశుధ్య వ్యవస్థ పూర్తిగా దిగజారిందని, కూటమి ప్రభుత్వం వచ్చాకే స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం ద్వారా పరిశుభ్రతా చర్యల్లో ప్రజల భాగస్వామ్యం పెరిగి, పరిస్థితులు మెరుగుపడ్డాయని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు.
శుక్రవారం ఆయన పట్టణ నాయకులతో కలిసి స్థానిక గడియార స్తంభం వద్ద నూతనంగా నిర్మించిన అత్యాధునిక చేపల మార్కెట్ ను ప్రారంభించారు. అనంతరం స్థానికులు, చేపల విక్రయదారుల్ని ఉద్దేశించి ప్రత్తిపాటి ప్రసంగించారు.
చేపల మార్కెట్ ను విక్రయదారులు సద్వినియోగం చేసుకోవాలి..
పట్టణ పురపాలక మరియు రాష్ట్ర మత్స్యశాఖ ఆర్థిక సహకారంతో రూ.1.25 కోట్లతో సకల వసతులతో 28 దుకాణాలతో నిర్మించిన మోడరన్ ఫిష్ మార్కెట్ ను ప్రారంభించడం ఎంతో ఆనందంగా



ఉందన్న ప్రత్తిపాటి.. చేపల విక్రయదారులు ఈ దుకాణ సముదాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం గొప్ప సదుద్దేశంతో నిర్మించిన మార్కెట్లోనే ఇకపై మత్స్య సంపదను విక్రయించాలని, రోడ్లపై, వీధుల్లో తాత్కాలిక దుకాణాలు పెట్టడానికి వీల్లేదని ఈ సందర్భంగా ప్రత్తిపాటి వ్యాపారులకు సూచించారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు చేపల మార్కెట్ నిర్మాణ ప్రతిపాదనకు బీజం పడిందని, ఆనాడే అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపించి, నిధులు మంజూరు చేయించామని ప్రత్తిపాటి తెలిపారు. పనులు ప్రారంభించి, మార్కెట్ నిర్మాణం పూర్తిచేసి, విక్రయదారులకు అందించాల్సిన కనీస బాధ్యతను వైసీపీ ప్రభుత్వం 5 ఏళ్లు పూర్తిగా విస్మరించిందన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో తమ ఉత్పత్తుల విక్రయం కోసం వ్యాపారాలు రోడ్లపైనే విక్రయాలు



ప్రారంభించడంతో, వ్యర్థాలు, దుర్వాసనతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని ప్రత్తిపాటి తెలిపారు.
కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తేళ్ల సుబ్బారావు, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు మద్దిబోయిన శివ, కొత్త కోటేశ్వరరావు, ముల్లా కరిముల్లా, కంచర్ల శ్రీనివాసరావు, మురకొండ మల్లిబాబు, కనమర్లపూడి రమేష్, ఉప్పుటూరి ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి బాబు, డి.ఈ అబ్దుల్ రహీమ్, వివిధ హోదాలలో ఉన్న నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద బాధితులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి:

## మంద కృష్ణ మాదిగ డిమాండ్




**చిలకలూరిపేట , పెన్ పవర్, ఆగస్టు 28 :**
చిలకలూరిపేట పట్టణంలోని అడ్డరోడ్డు సెంటర్ వద్ద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు-ఆటో ఢీకొన్న దుర్ఘటనలో ఏడుగురు దళిత కూలీలు మృతి చెందడంపై ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శుక్రవారం వేలూరు గ్రామానికి చేరుకున్న ఆయన, మృతుల భౌతికకాయాలకు నివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మరణించిన వారిలో ఆరుగురు దళిత మాదిగ మహిళలు, ఒక పురుషుడు ఉన్నారని, ప్రమాదం జరిగి 40 గంటలు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సాయం అందకపోవడం బాధాకరమన్నారు.
కూటమి ప్రభుత్వ ఏర్పాటులో ఎమ్మార్పీఎస్ కీలక పాత్ర పోషించిందని గుర్తు చేస్తూ, బాధితులను ఆదుకోవడంలో స్థానిక ఎమ్మెల్యే తీవ్ర నిర్లక్ష్యం వహించారని మంద కృష్ణ మాదిగ ఆరోపించారు. ఎమ్మెల్యే కేవలం సోషల్ మీడియా పోస్టు ద్వారా ప్రమాద సమాచారాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారే తప్ప, పరిహారం గురించి మాట్లాడలేదని బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా ఎమ్మార్పీఎస్, వామపక్ష పార్టీలు కలిసి రోడ్డుపై నిరసనలకు దిగాల్సి వచ్చిందని తెలిపారు.

గత దృష్టాంతాలను గుర్తుచేసిన వైనం

గతంలో ఉమ్మడి రాష్ట్రంలో రోశయ్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రమాదంలో మృతి చెందిన 7 మంది కూలీల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియాతో పాటు 10 రోజుల్లోనే రెండున్నర ఎకరాల భూమి కేటాయించిన విషయాన్ని ప్రస్తావించారు. అలాగే ఉత్తరాఖండ్‌లోని బియాస్ నది ప్రమాదం, కందుకూరు ఘటనల్లో గత పాలకులు మానవతా దృక్పథంతో బాధితులకు భారీగా పరిహారం, భూమి అందించి ఆదుకున్నారని గుర్తుచేశారు. దళితులు, పేదలు చనిపోయినప్పుడు ప్రభుత్వం అదే స్థాయిలో స్పందించాలని, సహాయం అందించడంలో ఎలాంటి పక్షపాతం లేదా వివక్ష చూపకూడదని కోరారు.

ప్రభుత్వం ముందుంచిన ప్రధాన డిమాండ్లు


మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి కనీసం రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు. జీవనాధారం కోల్పోయిన వ్యవసాయ కూలీల కుటుంబాలకు భరోసా కల్పించేలా ప్రతి కుటుంబానికి 2 ఎకరాల వ్యవసాయ భూమిని కేటాయించాలని డిమాండ్ చేశారు.
అలాగే బాధిత కుటుంబాల్లోని పిల్లల భవిష్యత్తు దెబ్బతినకుండా వారి పూర్తి స్థాయి విద్యా బాధ్యతను ప్రభుత్వమే భరించాలని కోరారు. ఇళ్లు కోల్పోయిన లేదా నిరాశ్రయులైన కుటుంబాలకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వడంతో పాటు, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన అన్ని ఖర్చులను ప్రభుత్వమే భరించాలని విజ్ఞప్తి చేశారు.

న్యాయం జరిగే వరకు ఆగని పోరాటం

నాయకులు కేవలం సంతాపాలు, సానుభూతి తెలపడానికే పరిమితం కాకుండా ఆచరణాత్మక సాయం అందించాలని మంద కృష్ణ మాదిగ స్పష్టం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయకపోతే, అంత్యక్రియలు పూర్తయినప్పటికీ న్యాయం దక్కేంత వరకు నిరసనలు, ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు.

## పీ4 సీఎం సమీక్షలో పాల్గొన్న

# ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



- విజన్ యూనిట్ల ఏర్పాటై ఏడాది పూర్తి సందర్భంగా సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్
- నెల్లూరులోని వీపీఆర్ కార్యాలయం నుంచి పాల్గొన్న కోవూరు ఎమ్మెల్యే

**కోవూరు పెన్ పవర్ ఆగస్టు 28.**
విజన్ యూనిట్లు ఏర్పాటు చేసి ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా పీ4 కార్యక్రమం అమలు, పురోగతిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పాల్గొన్నారు. నెల్లూరులోని వీపీఆర్ కార్యాలయం నుంచి ఎమ్మెల్యే వీడియో కాన్ఫరెన్స్‌లో హాజరయ్యారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలన లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీ4 కార్యక్రమం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అందుతున్న సహాయ సహకారాలు, ఆయా ప్రాంతాల్లో సాధిస్తున్న పురోగతిపై ముఖ్యమంత్రి ఈ సందర్భంగా సమీక్ష నిర్వహించారు.
విజన్ యూనిట్ల ద్వారా నియోజకవర్గ స్థాయిలో జరుగుతున్న కార్యక్రమాలు, అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారం, పేద కుటుంబాల సంక్షేమం తదితర అంశాలపై చర్చించారు. ఈ



వీడియో కాన్ఫరెన్స్‌లో పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, జిల్లా అధికారులు, జిల్లా విజన్ కమిటీ, నియోజకవర్గ విజన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అన్నమయ్య అధ్యాత్మిక సంకీర్తన లపై ఉపన్యాసం





**పెన్ పవర్ రొంపిచర్ల మండలం ఆగస్టు 28 :**పాకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో టీటీడీ, అన్నమయ్య ప్రాజెక్టు వారి ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు జరిగిన అన్నమయ్య సంకీర్తన లు –వెంకటేశ్వర వైభవం జాతీయ సదస్సు కు విద్యావేత్త డాక్టర్ టి . రఘునాథ్ హాజరై అన్నమయ్య ఆధ్యాత్మిక సంకీర్తనలు – వర్ణనలు అనే అంశం పై పత్ర సమర్పణ చేసి ఉపన్యాసించారు. అన్నమయ్య కీర్తనలు అన్ని వర్ణనలు, తిరుమల కొండ, అశేష జనావాళి భక్తికి సంబందించిన ముక్తి దాయకమని, భగవంతుడు ఒక్కడే సర్వంతర్యామి అని ఆయనను చేరుకోవాలంటే భక్తి మార్గమే మోక్ష సాధన మని తెలిపారు. అలాగే అన్నమయ్య శ్రీ వెంకటేశ్వర స్వామి మీద రాసిన భక్తి కీర్తనలు ఆలపించి భక్తి గొప్పతనం వివరించారు.సదస్సు అనంతరం శ్రీవారి ప్రసాదం సదస్సు సంచాలకులు తెలుగు అధ్యాపకులు ఈశ్వర్ బాబు చేతులు మీదుగా అందజేశారు.

# సీఎం చంద్రబాబుతో శ్రీలంక డిప్యూటీ హైకమిషనర్ భేటీ

**అమరావతి పెన్ పవర్, ఆగస్టు 28**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో చెన్నైలోని శ్రీలంక డిప్యూటీ హైకమిషనర్ డాక్టర్ గణేశనాథన్ గైథీశ్వరన్ శుక్రవారం మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇరువురు పలు అంశాలపై చర్చించారు. దక్షిణ భారత రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ, పుదుచ్చేరి రాష్ట్రాల్లో శ్రీలంకకు సంబంధించిన ద్వైపాక్షిక సంబంధాలను డాక్టర్ గణేశనాథన్ పర్యవేక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో జరిగిన భేటీలో ద్వైపాక్షిక సంబంధాలు, పరస్పర సహకారానికి సంబంధించిన అంశాలపై చర్చించినట్లు సమాచారం.

## అన్నాచెల్లెళ్ల అనుబంధానికి, ప్రేమకు, ఆప్యాయతకు ప్రతీకగా జరుపుకునే పవిత్రమైన పండుగ రక్షాబంధన్













**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ ఆగస్టు 28**

ఈ సందర్భంగా శ్రీ శాంతినికేతన్ సి. బి. ఎస్. ఈ స్కూల్ చైర్మన్ సూర్యదేవర సుధాకర్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఒక ప్రత్యేకమైన సందేశాన్ని సమాజానికి అందించేందుకు ముందుకు వచ్చారు. రక్షాబంధన్ అంటే కేవలం అన్నాచెల్లెళ్ల మధ్య రాఖీ కట్టుకోవడం మాత్రమే కాదు.మనల్ని అహర్నిశలు కష్టపడే ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేసే ఒక అందమైన అవకాశం.ఈ ఆలోచనతో పాఠశాల విద్యార్థులు ఎస్పీ ఆఫీస్ మరియు సిసింద్రీ చిల్డ్రన్ హాస్పిటల్‌ను సందర్శించారు ,ఈ సందర్భంగా విద్యార్థులు ఎస్పీ శ్రీ సునీల్ శరోన్ కి రాఖీ కట్టారు , ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు చేస్తున్న సేవలకు తమ కృతజ్ఞతలు, గౌరవాన్ని తెలియజేశారు. ఎస్పీ సునీల్ షెరోన్ విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించి, రక్షాబంధన్ ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణ, బాధ్యత, మంచి విలువలను అలవర్చుకుని సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా విద్యార్థులు సిసింద్రీ చిల్డ్రన్ హాస్పిటల్ వైద్యులైనడా. డి. మధుసూదన్ రెడ్డి కి,డా. పి. హరినాథ్ కిరాఖీలు కట్టి, వారు రాత్రి అనగా పగలనకా ప్రజలకు అందించే వైద్య సేవలో గణనీయం అని విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా పాఠశాలలో పనిచేస్తున్న మహిళా పరిశుభ్రత సిబ్బంది (క్లీనింగ్ సిబ్బంది)కి విద్యార్థులు ప్రేమతో రాఖీలు కట్టి, రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారుఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ సూర్యదేవర సుధాకర్ మాట్లాడుతూ, "రక్షాబంధన్ అనేది కేవలం అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమకు మాత్రమే ప్రతీక కాదు. మన సమాజాన్ని మనకోసం అహర్నిశలు కష్టపడే వారికి ప్రతి ఒక్కరి పట్ల కృతజ్ఞత, గౌరవాన్ని వ్యక్తం చేసే పండుగ కూడా. పోలీసు శాఖ మరియు వైద్య శాఖ అందిస్తున్న సేవలను గౌరవిస్తూ మా విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉంది" అని తెలిపారు.

# పిల్లలకు సమ పోషకాలను ఆహారంగా అందిస్తేనే సంపూర్ణ ఆరోగ్యం " సిడిపిఓ జ్యోతి కిరణ్ "





**సూళ్లూరుపేట : పెన్ పవర్, ఆగస్టు 28**

అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లలకు సమ పోషకాలు కలిగిన ఆహార పదార్థాలను అందిస్తేనే సంపూర్ణ ఆరోగ్య వంతులు అవుతారని సూళ్లూరుపేట ఐ సి డి ఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ జ్యోతి కిరణ్ అన్నారు. శుక్రవారం ప్రాజెక్ట్ కార్యాలయంలో దొరవారి సత్రం, తడ, సూళ్లూరుపేట మండల పరిధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారుల ఆరోగ్య స్థితిపతులపై వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మన్నార పోలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ డాక్టర్ అఖిలప్రియ పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలపై పరీక్షించారు. పిల్లలు తీవ్ర పోషకాహార లోపం (శాంమ్ ) మధ్యస్థ పోషకాహార లోపం (మాం మ్ ) ఉన్న వారిని గుర్తించి వారంతా తిరిగి ఆరోగ్యం వంతులు కావడానికి చికిత్స నిమిత్తం తిరుపతి లోని పోషక పునరావాస కేంద్రానికి తీసుకువెళ్లాలని రెఫర్ చేశారు. ప్రతి తల్లి బిడ్డ శారీరక, మానసిక ఎదుగుదల చెందాలంటే అన్ని పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు వారికి అందించే దినసరి ఆహారంలో చేర్చాలని చెప్పారు. ఈ సందర్భంగా సిడిపిఓ జ్యోతి కిరణ్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలు, తల్లుల కోసం అందించే పదార్థాలను నిర్లక్ష్యం చేయకుండా ఆహారంలో స్వీకరించాలని పేర్కొన్నారు. అన్ని పోషకాలు ఉన్న బాలామృతం ప్లస్ తీసుకుంటే. పిల్లలు పోషక స్థితి, ఎదుగుదల మెరుగుపడుతుందని సూచించారు. టాటా ట్రస్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ కె. అరుణ కుమారి మాట్లాడుతూ శామ్, మామ్, పిల్లలపై తీసుకోవాల్సిన ప్రత్యేక ఆరోగ్య విషయాలపై తల్లులకు వివరించారు. అంగన్వాడీ పిల్లలకు బాలామృతం ప్లస్ అందిస్తున్న టాటా ట్రస్ట్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ జ్యోతి కిరణ్, సిహెచ్ సి మెడికల్ ఆఫీసర్ అఖిలప్రియ, ఐ సి డి ఎస్ సూపర్వైజర్ అంకమ్మ, మెడికల్ సూపర్వైజర్ సంపూర్ణమ్మ, హెల్త్ అసిస్టెంట్ విజయ్ కుమార్, ఏఎన్ఎం, ఆశ, అంగన్వాడి కార్యకర్తల పాల్గొన్నారు.

# ఎస్.వి.ఆర్ విద్యార్థి తైక్వాండోలో జననికి స్వర్ణం



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ ఆగస్టు 28**

–శ్రీకాకుళంలో ఆగస్టు 20, 22, 23 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో ఎస్‌వీఆర్ ఇంజినీరింగ్ కాలేజ్ విద్యార్థిని పి. జనని స్వర్ణ పతకం సాధించింది. జూనియర్ అండర్49 కేజీల విభాగంలో పోటీపడి ప్రథమ స్థానంలో నిలిచింది.డిప్లొమా ఈఈఈ చదువుతున్న జనని రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి కళాశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావడంపై ఎస్‌వీఆర్ ఇంజినీరింగ్ కాలేజ్ మేనేజింగ్ డైరెక్టర్ దినేష్ రెడ్డి, ప్రిన్సిపాల్ హరి ప్రసాద్ రెడ్డి, డైరెక్టర్ మల్లికార్జున్ రెడ్డి, డిప్లొమా ప్రిన్సిపాల్ రామసుబ్బారెడ్డి అభినందించారు. విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని మేనేజింగ్ డైరెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ విల్సన్ కుమార్, జనని తల్లిదండ్రులు, అబ్దుల్ మజీద్ పాల్గొన్నారు.

# పరిశ్రమల ఏర్పాటుతో నిరుద్యోగ సమస్యకు చక్కటి పరిష్కారం

## " ఎమ్మెల్యే డాక్టర్, నెలవల విజయశ్రీ "





**నాయుడుపేట: పెన్ పవర్, ఆగస్టు 28**

సూళ్లూరుపేట నియోజకవర్గంలోని సెజ్ ల పరిధిలో ఏర్పాటు అవుతున్న పరిశ్రమలతో నిరుద్యోగ సమస్యకు కొంత పరిష్కారం ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ సూచించారు. శుక్రవారం ఆమె మేనకూరు సెజ్ పరిధిలోని అత్తివరం గ్రామపంచాయతీలో 57 కోట్లతో నిర్మించిన నూతన ఓక్టం లైఫ్ సైన్సెస్ పరిశ్రమను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో పారిశ్రామిక అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. తడ మండలం శ్రీ సిటీ, మాంబట్టు సెజ్ లతోపాటు, నాయుడుపేట, ఓజిలి మండలాల పరిధిలో ఉన్న పారిశ్రామికవాడలోకూడా ఎన్నో పరిశ్రమలు ఏర్పాటు కావడం ఆయా పరిసర ప్రాంత నిరుద్యోగులకు చక్కటి అవకాశం అని పేర్కొన్నారు. ఓక్టం లైఫ్ సైన్సెస్ పరిశ్రమలో స్థానిక నిరుద్యోగులకు అర్హతను బట్టి అవకాశం కల్పించాలని వారికి సూచించారు. ఈ కర్మాగారం ద్వారా ఔషధాలకు అవసరమైన ముడి సరుకుని తయారుచేసి ఎగుమతి చేయడం మన ప్రాంతానికి వచ్చిన మంచి అవకాశం అని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జి నెలల సుబ్రహ్మణ్యం, పార్టీ అధ్యక్షులు 786 రఫీ, సంచి కృష్ణయ్య, పలువురు టిడిపి నాయకులు కర్మాగార యాజమాన్యం పాల్గొన్నారు.

# గురు రాజా ఇంటర్నేషనల్ స్కూల్లో రక్షా బంధన్ వేడుకలు

### - నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ శోరాన్ కు రాఖీలు కట్టిన ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ ఆగస్టు 28**

నంద్యాల జిల్లా బాబా నగర్ సమీపంలోని శ్రీ గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్లో రక్షా బంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా విద్యార్థులకు గురు రాజా ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ షేక్షావలి రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన రక్షా బంధన్ వేడుకల్లో విద్యార్థులు ఆనందంగా పాల్గొని సోదరుభావాన్ని ప్రతిబింబించేలా రాఖీలు కట్టుకున్నారు. నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్ కు గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు రాఖీలు కట్టి రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే శ్రీ గురు రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డికి, ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ షేక్షావలి రెడ్డికి, గోస్పాడు ఎస్ఐ సుధాకర్ రెడ్డితో పట్టణంలోని వైద్యులకు, అధికారులకు గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు రాఖీలు కట్టారు. ఇంటర్నేషనల్ డైరెక్టర్ షేక్షావలి రెడ్డి మాట్లాడుతూ రాఖీ పండుగ ఎంతో విశిష్టమైందని గుర్తు చేశారు. సోదరుడు తన సోదరికి రక్షగా ఉంటూ రాఖీ కట్టడమే ఈ పండుగ విశిష్టతని గుర్తు చేశారు.

# రక్షాబంధన్ వేడుకల్లో ముఖ్య అతిథిగా ఎన్ఎండి ఫయాజ్





**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ ఆగస్టు 28**

నంద్యాల పట్టణంలోని మున్సిపల్ పార్క్ యోగా సెంటర్‌లో కండే ఆనంద్ గురూజీ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర తెలుగుదేశం పార్టీ యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకొని మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎన్ఎండి ఫయాజ్‌కు రాఖీలు కట్టి తమ ఆత్మీయతను చాటుకున్నారు. సోదరభావం, ఆప్యాయత, పరస్పర గౌరవానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని ఎన్ఎండి ఫయాజ్ పేర్కొన్నారు. మహిళల ప్రేమాభిమానాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కండే శ్యామ్ సుందర్ లాల్, కండే హరినాథ్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ దస్తగిరి, వాకర్స్ అసోసియేషన్ గవర్నర్ మునగాల రామచంద్రారెడ్డి, లింగం బాబు, సులోచన, టీచర్ వసుమతి, టీచర్ సుకుమాంబ, అపర్ణ, నాగరాజు, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ధరల మంట.. అల్లాడుతున్న సామాన్యుడు!




**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ ఆగస్టు 28:**

నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని సీపీఐ పట్టణ కార్యదర్శి కె. ప్రసాద్ విమర్శించారు. ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో సాయిబాబానగర్ సర్కిల్ వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ బియ్యం, పప్పులు, చక్కెర, వంటనూనె తదితర నిత్యావసరాల ధరల పెరుగుదలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దళారులు, వ్యాపారులు అక్రమ నిల్వలతో కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచుతున్నారని ఆరోపించారు. అక్రమ నిల్వలపై టాస్క్‌ఫోర్స్ దాడులు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.పీడీఎస్ ద్వారా గతంలో మాదిరిగా బియ్యం, కందిపప్పు, చక్కెర తదితర నిత్యావసరాలను చౌక ధరలకు పంపిణీ చేయాలని కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే చలో కలెక్టరేట్ చేపడతామని హెచ్చరించారు.కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జి. నాగరాముడు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి. సోమన్న, ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షులు డి. శ్రీనివాసులు, మహిళా సమాఖ్య నాయకులు సుశీలమ్మ, సరోజమ్మ, హుస్సేన్అమ్మ, నాగేశ్వరరావు, రమాదేవి, నాగార్జున, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

# భార్యను హత్య చేసిన భర్త అరెస్ట్



**సూళ్లూరుపేట : పెన్ పవర్, ఆగస్టు 28**
సూళ్లూరుపేట మండల పరిధిలోని కోటపోలూరు అంబేద్కర్ నగర్ లో గత బుధవారం భార్యపై అనుమానంతో భర్త కిరాతకంగా చంపిన విషయం తెలిసిందే. ఈ సంఘటనలో ముద్దాయి పనబాక శ్రీనివాసులను శుక్రవారం అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నట్లు సీఐ మురళీకృష్ణ మీడియా సమావేశంలో వెల్లడించారు. శ్రీనివాసులుకు సంధ్య అనే మహిళ వివాహమై ఇద్దరు పిల్లలు. 14 ఏళ్ళు కాపురం కొనసాగించారు. ఇటీవల వారి మధ్య కలహాలు రేగి, అనుమానం అనే పెనుభూతంతో శ్రీనివాసులు ప్రణాళిక ప్రకారం కోటపోలూరు గ్రామ పొలాల సమీప వద్ద హత్య చేసి నిందితుడయ్యాడు. శుక్రవారం సిఐ మురళీకృష్ణ, ఎస్సై అజయ్ కుమార్ ముద్దాయిన అరెస్టు చేసి కోర్టుకు తరలించడం జరిగింది.

# బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్‌ను సందర్శించిన నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నందికొట్కూరు పెన్ పవర్ ఆగస్టు 28**
నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గ శాసనసభ్యులు గిత్త జయసూర్య, నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా శుక్రవారం బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్‌ను సందర్శించి నీటి ప్రవాహం, సాగునీటి సరఫరా పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా రెగ్యులేటర్ వద్ద నీటి ప్రవాహం, ప్రస్తుత సాగునీటి పరిస్థితులు, రైతులకు అందుతున్న నీటి సరఫరా తదితర అంశాలపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. సాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. రైతులకు సాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అవసరమైన చోట అధికారుల మధ్య సమన్వయంతో సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల ప్రయోజనాలే ప్రధాన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. సాగునీటి వనరులను సమర్థవంతంగా వినియోగించడంతో పాటు రైతులకు అవసరమైన సమయంలో నీరు అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వేమిరెడ్డి దంపతులకు రాఖీ శుభాకాంక్షలు

# తెలిపిన మహిళా నాయకులు





**నెల్లూరు పెన్ పవర్ ఆగస్టు 28.**
రాఖీ పూర్ణిమ సందర్భంగా శుక్రవారం పలువురు మహిళా నాయకులు నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహిళా నాయకులు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి రాఖీ కట్టి, ఆశీర్వాదాలు తీసుకున్నారు. అనంతరం స్వీట్లు తినిపించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర మేయర్ దేవరకొండ సుజాత, బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైస్ ఛైర్ పర్సన్ పఠాన్ నస్రీన్, కోవూరు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు షేక్ పర్వీన్, కౌన్సిలర్‌లు వైష్ణవి, ప్రత్యూష, లక్ష్మీ కాంతమ్మ, లలిత రెడ్డి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# యూటీఎఫ్ నిరసన



**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఆగస్టు 18.**
ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా అంటూ విడుదల చేసిన టి ఈ టి నోటిఫికేషన్ నిరసిస్తూ బుచ్చిరెడ్డిపాలెం పార్కు సెంటర్ నుంచి బస్టాండ్ వరకు యూటీఎఫ్ బుచ్చి ప్రాంతీయ శాఖలైన బుచ్చి దగదర్తి సంఘం మండల శాఖల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వివి శేషులు మాట్లాడుతూ మాట్లాడుతూ ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ 2010 ముందు నియమితులైన వారికి మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రాతినిధ్యం చేయటం అనేక ఆందోళన కార్యక్రమాలు చేయటం జరిగిందని వాటిని వేటిని పట్టించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ అంటూ నోటిఫికేషన్ ఇవ్వడం అందులో ఎలాంటి సవరణ లేకుండా ఉండటం ఉపాధ్యాయులని ఆందోళన గురి చేస్తుందని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యాహక్కు చట్టంలో సవరణ చేయాలని,ప్రత్యేక టెట్టు నిర్వహించాల్సి వస్తే అందరూ ఉపాధ్యాయులకి ఒకే రకమైన అర్హత మార్కుల్ని(40%) పెట్టాలని పరీక్ష ఆన్లైన్ లో కాకుండా ఆఫ్లైన్లో నిర్వహించాలని స్కూల్ అసిస్టెంట్లను ఏ సబ్జెక్టు బోధిస్తూ ఉంటే ఆ సబ్జెక్టు సిలబస్ తో పరీక్ష నిర్వహించాలని ఈ విధమైన చర్యలు తీసుకొనుటకు ప్రభుత్వం స్పందించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా జిల్లా కార్యదర్శిలు కే నాగిరెడ్డి కె.వి. శ్రావణ్ కుమార్ కుటుంబ సంక్షేమ డైరెక్టర్ టి.గోపాలకృష్ణమూర్తి బుచ్చి దగదర్తి సంగం మండల శాఖల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్ హజరత్ బాబు, జెడ్ కృష్ణమోహన్ వి.గోపిజి.ఉమాశంకర్ ఎస్.కె .మహమ్మద్‌కే.వేణు నాయకులు పాల్గొన్నారు

# ఆగిఉన్న లారీనీ డీకొట్టిన కర్ణాటక ఆర్టీసీ బస్సు...

-బస్సులో ప్రయాణిస్తున్న 16 మందికి గాయాలు..
- ముగ్గురు పరిస్థితి విషయం...
-సంఘటన స్థలానికి చేరుకునీ దర్యాప్తు చేస్తున్న రూరల్ సీఐ సంగమేశ్వర రావు...

**పెళ్లకూరు,పెన్ పవర్, ఆగస్టు 28**
నేషనల్ హైవే పై ఆగి ఉన్న కట్టెల లోడు లారీని కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఆర్టీసీ వోల్వా బస్సు ఢీకొట్టిన సంఘటన తిరుపతి జిల్లా పెళ్ళకూరు మండలం చంబడిపాలెం జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవార జామున చోటుచేసుకుంది... పోలీసుల వివరాల మేరకు బెంగుళూరు నుంచి నెల్లూరుకి 16 మంది ప్రయాణికులతో వస్తున్న కర్ణాటక ఆర్టీసీ బస్సు మార్గమధ్యమంలోని చంబడి పాల్యం జాతీయ రహదారి వద్దకు వచ్చేసరికి కట్టెల లోడుతో మరమ్మతులకు గురై రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని అతివేగంగా వస్తున్న ఆర్టీసీ బస్సు వెనకనుంచి ఢీకొంది...ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ తో పాటు బస్సులో ప్రయాణిస్తున్న 16 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి....ఈ మేరకు సమాచారం అందుకున్న పెళ్లకూరు ఎస్సై. దారం.ఆదిలక్ష్మి, పోలీసు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని గాయాలు పాలైన జతగాత్రులను 108 వాహనంలో నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించడం జరిగింది.. వీరిలో ఇద్దరు పరిస్థితి విషయంగా ఉండటంతో వారిని ప్రథమ చికిత్సల అవసరం




మెరుగైన చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.. ఈ సంఘటనలో చిన్నారులు ఉండడంతో గాయాల పాలైన తల్లిదండ్రులను చూసి ఏడుస్తున్నడంతో అందరిని కంటితడి







పెట్టించింది...ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆదిలక్ష్మి తెలియజేశారు.

## అమరులైన మరియు పదవీ విరమణ చేసిన సిబ్బంది కుటుంబాల

# సంక్షేమంపై సమీక్షా సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ...

- పదవీ విరమణ చేసిన అధికారులు, అమరులైన పోలీసు సిబ్బంది కుటుంబాల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి.....

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ ఆగస్టు 28**
నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఐపీస్ ఆధ్వర్యంలో పోలీస్ శాఖలో పదవీ విరమణ చేసిన అధికారులు మరియు విధులు నిర్వహిస్తూ అమరులైన పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యులతో సంక్షేమ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పదవీ విరమణ చేసిన అధికారులు, అమరులైన పోలీసు సిబ్బంది కుటుంబాల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. వారికి ప్రభుత్వం ద్వారా ఇప్పటివరకు అందిన వివిధ సంక్షేమ ప్రయోజనాలు, ఆర్థిక బెనిఫిట్స్, పెన్షన్ మరియు ఇతర ప్రయోజనాల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.అదేవిధంగా, ఇంకా అందాల్సి ఉన్న బెనిఫిట్స్, పరిష్కరించాల్సిన పెండింగ్ అంశాలు, ఆయా కుటుంబాలకు సంబంధించిన సంక్షేమ సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో జిల్లా ఎస్పీ చర్చించారు.పోలీస్ శాఖలో ఎన్నో సంవత్సరాల పాటు విధులు నిర్వర్తించి పదవీ విరమణ చేసిన అధికారులు, అలాగే విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అమరులైన పోలీసు సిబ్బంది కుటుంబాల సంక్షేమానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎస్పీ పేర్కొన్నారు. వారి కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా అందాల్సిన ప్రతి ప్రయోజనం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఇంకా పెండింగ్‌లో ఉన్న బెనిఫిట్స్‌కు సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేసి, త్వరలోనే అర్హులైన వారికి రావాల్సిన అన్ని ప్రయోజనాలను అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా ఎస్పీ స్పష్టంగా ఆదేశించారు. పదవీ విరమణ చేసిన అధికారులు మరియు అమరులైన పోలీసు సిబ్బంది కుటుంబాల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, వారి సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని, వారికి అవసరమైన సహాయ సహకారాలను అందించాలని సంబంధిత అధికారులకు ఎస్పీ సూచించారు.ఈ సమావేశం ద్వారా పోలీసు శాఖలో



సేవలందించిన రిటైర్డ్ అధికారులు, విధి నిర్వహణలో అమరులైన పోలీసు సిబ్బంది కుటుంబాల సంక్షేమంపై జిల్లా పోలీస్ శాఖకు ఉన్న నిబద్ధతను మరోసారి స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు ఏ.ఆర్ అడిషనల్ ఎస్పీ చిన్నికృష్ణ , జిల్లా పరిపాలన అధికారులు వీరన్న, ఖాదర్ భాషా ,కవిత, జిల్లా పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ స్వామి నాయక్ పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిరెడ్డి కి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపిన మహిళలు





**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ ఆగస్టు 28**
రక్షాబంధన్ పండగ వేళ నంద్యాలలో పండగ వాతావరణం సంతరించుకుంది. రాఖీ పౌర్ణమి సందర్భంగా మాజీ శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డికి నంద్యాల మహిళలు, వైఎస్సార్సీపీ మహిళా నేతలు ఘనంగా రాఖీలు కట్టి తమ సోదరభావ్యాన్ని చాటుకున్నారు.శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి నివాసానికి మహిళలు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ఈ సందర్భంగా శిల్పా రవిరెడ్డికి నంద్యాల నియోజకవర్గానికి చెందిన పలువురు మహిళలు, అక్కాచెల్లెళ్ళు రాఖీలు కట్టి, మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. తమను సోదరుడిలా ఆదరిస్తూ, ఎల్లవేళలా అండగా నిలుస్తున్నందుకు మహిళలు ఈ సందర్భంగా ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. మహిళల ఆత్మీయతకు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. తనకు రాఖీ కట్టిన ప్రతి అక్కాచెల్లెలికి ఆయన రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. నంద్యాల ఆడపడుచులందరికీ తాను ఎల్లప్పుడూ ఒక అన్నగా, తమ్ముడిగా అండగా ఉంటానని, వారి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.

# మహానంది క్షేత్రంలో

## వైభవంగా పల్లకి సేవ



**మహానంది, పెన్ పవర్ ఆగస్టు 28**
మహానంది క్షేత్రంలో శ్రావణ శుక్రవారం రాత్రి పల్లకీ సేవను ఆలయ వేదపండితులు,అర్చకులు వైభవంగా నిర్వహించారు.ఆలయ ఈవో శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అలంకార మండపంలో శ్రీ కామేశ్వరీ సహిత మహానందీశ్వర స్వామివారి ఉత్సవ మూర్తులను పల్లకిలో ఆశీనులు గావించి,విశేష పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తుల శివనామస్మరణ మధ్య పల్లకీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.?

# సీఎం చంద్రబాబుతో మారిషస్

## మంత్రి లచ్మణా (రాజ్) పెంటియా భేటీ

**అమరావతి పెన్ పవర్ ఆగస్టు 28**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో మారిషస్ పబ్లిక్ సర్వీస్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రీఫార్మ్స్ శాఖ మంత్రి లచ్మణా (రాజ్) పెంటియా శుక్రవారం మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఇటీవల మారిషస్ కేబినెట్ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన లచ్మణా (రాజ్) పెంటియా, ముఖ్యమంత్రి చంద్రబాబుతో జరిగిన భేటీలో ద్వైపాక్షిక అంశాలతో పాటు పరిపాలనా సంస్కరణలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. పరిపాలనా రంగంలో పరస్పర సహకారం, సంస్కరణలకు సంబంధించిన పలు అంశాలు సమావేశంలో ప్రస్తావనకు వచ్చినట్లు తెలిపారు.

# 29 అజెండాలకు ఆమోదం..

## రెండింటిపై భిన్నాభిప్రాయాలు

- బుచ్చిరెడ్డిపాలెం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చర్చ




**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఆగస్టు 28.**
బుచ్చిరెడ్డిపాలెం: మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళి అధ్యక్షతన, కమిషనర్ చిన్నబాబు ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం జరిగింది.మొత్తం 31 అజెండాలను కమిషనర్ కౌన్సిల్ ముందుంచగా.. 29 అజెండాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. ఒక అజెండాను వాయిదా వేయగా.. మరో అజెండాను తిరస్కరించారు.వార్షిక వినియోగంపై



అభ్యంతరం: జనరల్ ఫండ్ నుంచి వార్షిక వినియోగం కోసం రూ.3 కోట్లు వెచ్చించే అంశంపై వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ షాహుల్ అభ్యంతరం వ్యక్తం చేశారు.మున్సిపాలిటీ వార్షిక ఆదాయం సుమారు రూ.5 కోట్లు ఉంటే.. అందులో రూ.3 కోట్లు వినియోగానికి కేటాయిస్తే మిగిలిన అవసరాలకు నిధుల పరిస్థితి ఏమిటని కమిషనర్‌ను ప్రశ్నించారు.దీనిపై కమిషనర్ చిన్నబాబు స్పందిస్తూ.. మున్సిపాలిటీకి వచ్చే వార్షిక ఆదాయానికి అనుగుణంగానే ఖర్చులు చేపడుతున్నామని, అవసరమైన అన్ని కార్యక్రమాలకు నిధులు సరిపోతాయని తెలిపారు.టేబుల్ అజెండాలకూ ఆమోదం: సమావేశంలో ప్రవేశపెట్టిన టేబుల్ అజెండాలను కూడా మెజార్టీ కౌన్సిలర్లు ఆమోదించడంతో వాటికీ ఆమోదం లభించిందని చైర్‌పర్సన్ సుప్రజా తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.సమావేశంలో కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# వైఎస్ఆర్‌సీపీ నేతల మాస్టర్ ప్లాన్లు

**విశాఖపట్టణం, ఆగస్టు 28, పెన్ పవర్:** ఉత్తరాంధ్ర రాజకీయం ఎప్పుడూ కుల సమీకరణాలు, బలమైన కుటుంబాల ఆధిక్యత చుట్టూనే తిరుగుతుంటుంది. ముఖ్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో అత్యంత కీలక పాత్ర పోషించిన సీనియర్ నేతలు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్ వంటి దిగ్గజాలు ప్రస్తుతం ఒకే రకమైన రాజకీయ ప్రాధాన్యతతో అడుగులు వేస్తున్నారు. రాష్ట్రంలో పార్టీ ప్రతిపక్షంలో ఉన్న తరుణంలో.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను వేదికగా చేసుకుని, తమ వారసులను పూర్తిస్థాయి రాజకీయల్లోకి రంగప్రవేశం చేయించి, వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే వీరి అసలు ఎజెండాగా కనిపిస్తోందనే విశ్లేషణలు ఊపందుకున్నాయి.విజయనగరం జిల్లాలో బొత్స కుటుంబానిది దశాబ్దాల రాజకీయ ప్రస్థానం. బొత్స సత్యనారాయణ భార్య, సోదరులు ఇప్పటికే ప్రజాప్రతినిధులుగా పనిచేసిన అనుభవం ఉంది. అయితే, ఇప్పుడు బొత్స దృష్టి తర్వాతి తరంపై పడిందనే ప్రచారం గట్టిగా సాగుతోంది. తన కుమార్తెను వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బరిలోకి దించి, విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ పీఠంపై కూర్చోబెట్టాలని బొత్స సత్యనారాయణ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు పార్టీ వర్గాల్లో టాక్ నడుస్తోంది. స్థానిక పోరు ద్వారా సీటు ఖాయం చేసుకుంటే.. భవిష్యత్తులో అసెంబ్లీ లేదా పార్లమెంట్ స్థానాలకు ఆమెను సులువుగా తీసుకురావచ్చనేది బొత్స ప్లాన్. పార్టీ అధికారాన్ని కోల్పోయిన సమయంలో కేడర్‌ను కాపాడుకోవడంతో పాటు, తమ సొంత వారసులకు స్థానిక సంస్థల ద్వారా అధికారిక గుర్తింపు తీసుకురావడం సీనియర్ నేతలకు రెండు రకాలుగా కలిసివచ్చే అంశం. ఇక శ్రీకాకుళం జిల్లా రాజకీయాలను శాసిస్తున్న ధర్మాన సోదరుల రూట్ కూడా ఇంచుమించు ఇదే దారిలో సాగుతోంది. ధర్మాన ప్రసాదరావు తన కుమారుడు ధర్మాన రామ్‌మనోహర్ నాయుడిని, కృష్ణదాస్ తన కుమారుడు కృష్ణ చైతన్యను ఇప్పటికే నియోజకవర్గ స్థాయి కార్యక్రమాల్లో చురుగ్గా తిప్పుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఓటమి తర్వాత.. కుమారులను ప్రజల్లోకి నేరుగా తీసుకెళ్లడానికి స్థానిక ఎన్నికల కంటే మంచి అవకాశం మరొకటి ఉండదని ధర్మాన సోదరులు భావిస్తున్నారు. జెడ్పీటీసీ లేదా కార్పొరేషన్ స్థాయి పోటీల ద్వారా వీరిని క్షేత్రస్థాయికి అలవాటు చేయాలని చూస్తున్నారు.ఈ పరిణామాల వెనుక ఉన్న అసలు పొలిటికల్ ట్విస్ట్ ఏమిటంటే.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సొంత పార్టీని నడిపించడం కంటే, తమ కుటుంబ రాజకీయ వారసత్వం చేజారిపోకుండా చూసుకోవడానికే ఈ సీనియర్లు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. అధికారం చేతిలో లేని సమయంలో పార్టీ తరఫున గట్టిగా పోరాడే కంటే, స్థానిక ఎన్నికల రూపంలో వచ్చిన అవకాశాన్ని వాడుకుని తమ వారసులకు ప్రజాప్రతినిధి ముద్ర వేస్తే, భవిష్యత్తులో అధికార మార్పిడి జరిగినప్పుడు సులువుగా స్థిరపడవచ్చనేది వీరి ఆలోచన. ఈ వారసత్వ రాజకీయాల ఎత్తుగడలకు క్షేత్రస్థాయిలో అనేక సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి బలంగా ఉంది. అధికారంలో ఉన్న కూటమి స్థానిక ఎన్నికల్లో తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి శతవిధాలా ప్రయత్నిస్తుంది. ఈ పరిస్థితుల్లో సీనియర్లు తమ ప్రభావంతో వారసులను గెలిపించుకోవడం అనుకున్నంత తేలికైన విషయం కాదు. పైగా వైసీపీలోని ద్వితీయ శ్రేణి నాయకులు, సుదీర్ఘకాలంగా పార్టీని నమ్ముకున్న కేడర్ ఈ వారసత్వ నిర్ణయాలను ఎంతవరకు ఆమోదిస్తారనేది ప్రశార్థకమే.ఉత్తరాంధ్ర వైసీపీ సీనియర్లు బొత్స, ధర్మాన సోదరులకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు కేవలం పార్టీ ఉనికిని చాటుకునే పోరాటం మాత్రమే కాదు. తమ రాజకీయ వారసుల భవిష్యత్తును నిర్ణయించే అగ్నిపరీక్ష . తమ బలాన్ని ఉపయోగించి వారసులను స్థానిక పీఠాలపై కూర్చోబెట్టి పొలిటికల్ రీ-లాంచ్ చేస్తారా లేక అధికార కూటమి ధాటికి డిఫెన్స్‌లో పడతారా అనేది వేచి చూడాలి.


03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి


## ఫినిషింగ్ దశకు కడప స్టార్టప్ హబ్

**కడప, ఆగస్టు 28, పెన్ పవర్:** : రాయలసీమ ప్రాంతంలో ఐటీ, సాంకేతిక రంగాల ముఖచిత్రాన్ని మార్చేందుకు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కడప స్టార్టప్ హబ్ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. ఇప్పటివరకు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి మహానగరాలకే పరిమితమైన స్టార్టప్ సంస్కృతిని రాయలసీమ యువతకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఇది రూపుదిద్దుకుంది. స్థానిక నిరుద్యోగ యువత ఉన్నత చదువుల అనంతరం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లే అవసరం లేకుండా, ఇక్కడే కొత్త ఆవిష్కరణలు, వ్యాపారాలు ప్రారంభించేందుకు ఇది అద్భుత వేదికగా నిలవనుంది. అత్యాధునిక మౌలిక సదుపాయాలతో సిద్ధమైన ఈ భవనాన్ని త్వరలోనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభించేందుకు కడప జిల్లా యంత్రాంగం వేగంగా సన్నాహాలు చేస్తోంది.ఉద్యోగాల కోసం ఆశించే స్థాయి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి.. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలి" అన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టికి అనుగుణంగా జిల్లా పాలనా యంత్రాంగం ఈ ప్రాజెక్టును ఆకృతి చేసింది. స్టార్టప్ కడప పేరుతో పిలిచే ఈ ప్రతిష్టాత్మక హబ్‌ను ౹్రా4 మోడల్‌లో రూపొందించారు. ఐఐటీలు, ఐఐఎంల నిపుణులు, గ్లోబల్ టెక్ కంపెనీల అధిపతులతో విద్యార్థులు , ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు మెంటార్‌షిప్ ఇచ్చేలా దీనికి శ్రీకారం చుట్టారు.ఈ స్టార్టప్ హబ్ నిర్మాణాన్ని కడప జిల్లా యంత్రాంగం పర్యవేక్షణలో ప్రైవేట్, ప్రభుత్వ భాగస్వామ్యంతో శరవేగంగా పూర్తి చేశారు. మొత్తం రూ. 12 కోట్ల అంచనా వ్యయంతో 30,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో +౦3 ఆకృతిలో ఈ భవనాన్ని నిర్మించారు. ఈ ప్రాజెక్టు నిధుల కోసం కేంద్ర ప్రభుత్వ పరిధిలోని నీతి ఆయోగ్ రూ. 3 కోట్లు మంజూరు చేయగా, ప్రముఖ మౌలిక వసతుల సంస్థ షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ తమ జూ= నిధుల కింద రూ. 4 కోట్లు ఆర్థిక సహాయం అందించింది. మిగిలిన నిధులను జిల్లా యంత్రాంగం సేకరించి నిర్మాణాన్ని పూర్తి చేసింది.ఈ భవనంలో ఒకేసారి 400 మందికి పైగా పనిచేసుకునేలా ప్లగ్ అండ్ ప్లే వర్కింగ్ స్పేస్ వసతిని కల్పించారు. సరికొత్త బిజినెస్ ఐడియాతో వచ్చే యువతకు హై-స్పీడ్ ఇంటర్నెట్, ప్రొటోటైపింగ్ ల్యాబ్‌లు, లీగల్, ఫైనాన్షియల్ సలహాలతో పాటు ఫండింగ్ సమకూర్చే గ్లోబల్ వెంచర్ క్యాపిటలిస్టులను కూడా ఇక్కడికి అనుసంధానించనున్నారు. కడపను ఐటీ, ఆవిష్కరణల నిలయంగా మార్చే దిశగా ఈ భవన ప్రారంభోత్సవం సరికొత్త మైలురాయిగా నిలవనుందని స్థానిక పారిశ్రామిక వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.జగన్ ఎప్పుడూ కడపకు ఐటీ గురించి ఆలోచించలేదు.. ఫిష్ మార్టుల గురించి మాత్రమే గొప్పగా చెప్పేవారు. అందుకే కనీసం క్రెడిట్ తీసుకునేందుకు ఒక్క శాతం కూడా చాయిస్ లేకుండా పోయింది.

## అప్పుడు ముద్దు... ఇప్పుడు వద్దా...

**విజయవాడ ఆగస్టు 28, పెన్ పవర్:** : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో స్థానిక సంస్థల ఎన్నికల సమయం దగ్గర పడింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి స్థానిక ఎన్నికల్లో ఏకగ్రీవాలు అసలు వద్దు.. ప్రతీ చోటా పోటీకి దిగి తీరాల్సిందే అంటూ ఆయన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఎక్కడైనా ఏకగ్రీవాలు అయితే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లు ఇవ్వనని తేల్చేశారు. ఇదే జగన్ గతంలో అధికారంలో ఉన్న సమయంలో జరిగిన స్థానిక పోరులో సరికొత్త రికార్డు స్థాయిలో ఏకగ్రీవాలు నమోదు కావడం, ఇప్పుడు దానికి భిన్నంగా ఆయన వ్యాఖ్యానించడమే దీనికి ప్రధాన కారణం.వైసీపీ పాలనా కాలంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల గణాంకాలను పరిశీలిస్తే ఏకగ్రీవాల హవా ఎంతలా సాగిందో అర్థమవుతుంది. ఆనాడు రాష్ట్రంలో మొత్తం 660 జెడ్పీటీసీ స్థానాలకు గాను ఏకంగా 126 స్థానాలు పోటీ లేకుండానే ఏకగ్రీవమయ్యాయి. ఇక ఎంపీటీసీల విషయానికొస్తే మొత్తం 9,696 స్థానాలకు ఎన్నికలు ప్రకటిస్తే, రికార్డు స్థాయిలో 2,371 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. వీటిలో 2,271కి పైగా స్థానాలను అధికారంలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీయే సొంతం చేసుకుంది. 2021 స్థానిక పోరులో పంచాయతీల నుంచి కార్పొరేషన్ల వరకు వేల స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. కానీ నేడు ప్రతిపక్షంలోకి రాగానే జగన్ ఏకగ్రీవాలకు స్వస్తి పలికి ఓటింగ్ జరగాల్సిందే అని పట్టుబట్టడం రాజకీయ శైలిలోని వ్యూహాత్మక మార్పును సూచిస్తోంది.గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు నాటి అధికార పార్టీ ఏకగ్రీవాల దిశగా వేగంగా అడుగులు వేసింది. నాలుగు విడతల్లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో మొత్తం 13,097 పంచాయతీలకు గాను 2,196 పంచాయతీలు, అలాగే 1,31,325 వార్డులకు గాను 47,400 కంటే ఎక్కువ వార్డు స్థానాలు ఏకగ్రీవంగా ముగిశాయి. ఇక పట్టణ స్థానిక సంస్థల్లో చూస్తే.. 11 కార్పొరేషన్లు, 75 మున్సిపాలిటీలు మరియు నగర పంచాయతీల్లోని మొత్తం 2,711 వార్డులలో 590 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. ముఖ్యంగా చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లోని 50 డివిజన్లలో 37 డివిజన్లు, కడప కార్పొరేషన్ పరిధిలోనూ సింహభాగం ఏకగ్రీవాలు అయ్యాయి.ఇప్పుడు వైఎస్ జగన్ ఏకగ్రీవాలు వద్దు అని చెప్పడం వెనుక ఉన్న అసలు పొలిటికల్ క్రక్స్ స్పష్టంగా కనిపిస్తోంది. సాధారణంగా స్థానిక ఎన్నికల్లో అధికారంలో ఉన్న పార్టీకే ఏకగ్రీవాలు చేసుకునేందుకు ఎక్కువ అనుకూల పరిస్థితులు ఉంటాయి. అధికార యంత్రాంగం, పోలీసు వ్యవస్థతో పాటు స్థానిక ప్రభావం కూటమి వైపు ఉండే అవకాశం ఉంది కాబట్టి.. ఈ సమయంలో ఏకగ్రీవాలకు మొగ్గు చూపితే ప్రత్యర్థి పార్టీలే మెజారిటీ స్థానాలను పోటీ లేకుండా కైవసం చేసుకుంటాయనే ముందస్తు అంచనా జగన్‌లో ఉంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు క్షేత్రస్థాయి కేడర్‌ను యాక్టివ్‌గా ఉంచడం అత్యంత ముఖ్యం. ఏకగ్రీవాలకు ఒప్పుకుంటే గ్రామాల్లో పార్టీ కార్యకర్తలు నిరాశకు గురవుతారు. ఓటింగ్ వరకు వెళ్తేనే అధికార కూటమిని నిలదీసే అవకాశం లభించడమే కాకుండా, రాబోయే రోజుల్లో కేడర్‌లో ఉత్సాహం నింపవచ్చని జగన్ భావిస్తున్నారు. అందుకే ఏకగ్రీవాల ప్రక్రియను నిరోధించడం ద్వారా కూటమికి సులువైన విజయం దక్కకుండా అడ్డుకోవాలనేది వైసీపీ వ్యూహం.ఈ నిర్ణయంలో ఒక రాజకీయ వైరుధ్యం కూడా కనిపిస్తోంది. తమ హయాంలో ఏకగ్రీవాలు జరిగినప్పుడు వాటిని సంక్షేమ పాలనకు ప్రజలు ఇచ్చిన మద్దతు అని సమర్థించుకున్న వైసీపీ నేతలు.. ఇప్పుడు మాత్రం ఏకగ్రీవాలు జరిగితే అది అక్రమమే, బెదిరింపుల వల్లే జరుగుతోంది అనే ప్రచారం చేయడానికి సిద్ధమవ్వాల్సి వస్తోంది. ఏది ఏమైనా.. అధికారంలో ఉన్నప్పుడు ఏకగ్రీవాలను ప్రోత్సహించడం, ప్రతిపక్షంలోకి రాగానే వాటిని వ్యతిరేకించడం అనేది ఏపీ రాజకీయాల్లో సుదీర్ఘకాలంగా వస్తున్న అధికార-ప్రతిపక్షాల పాత ఫార్ములానే అని చెప్పవచ్చు.

# స్థానికంపై జనసేన వ్యూహమేంటి? 28 జడ్పీల్లో సేన వాటా ఎంత?



**విశాఖపట్టణం, ఆగస్టు 28, పెన్ పవర్:**రాష్ట్రంలో స్థానిక ఎన్నికల వాతావరణం క్రమంగా అలుముకుంటోంది. అన్నిపార్టీలు ఎన్నికల సన్నాహాక సమావేశాలతో శ్రేణులను సిద్ధం చేస్తున్నారు. అయితే అధికార కూటమిలోని జనసేన వైఖరి ఎలా ఉంటుందనేదే ఇప్పుడు ఆసక్తి రేపుతోంది. స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీ ఎన్నిస్థానాల్లో పోటీ చేస్తుందనేది ప్రధాన చర్చనీయాంశంగా మారిందని చెబుతున్నారు. తమకు బలం ఉన్న చోట పోటీకి రెడీ అంటూ జనసేన నేతలు సంకేతాలు ఇవ్వడం కూటమి రాజకీయాలను వేడెక్కిస్తోంది. మరోవైపు టీడీపీ కూడా పోటీకి సై అంటుండటంతో స్థానిక ఎన్నికలు హీట్ పుట్టిస్తున్నాయని అంటున్నారు. స్థానిక ఎన్నికల్లో జనసేన ఎన్ని స్థానాల్లో పోటీ చేస్తుందనే అంశమే ఇప్పుడు హాట్ టాపిక్ అవుతోంది. గతంలో టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంటు, మంత్రి నారా లోకేశ్ ప్రతిపాదించిన 80:15:5 నిష్పత్రి తమకు అంగీకారం కాదని జనసేన తేల్చిచెప్పడం, ఆ తర్వాత ఏ ప్రాతిపదికన పోటీ చేస్తారనే అంశమై స్పష్టత ఇవ్వకపోవడంతో స్థానిక ఎన్నికల్లో జనసేన పోటీపై కార్యకర్తలే అయోమయ పరిస్థితి ఎదుర్కొంటున్నారు. ఇదే సమయంలో కొన్నిచోట్ల కూటమి సర్దుబాట్లపై అవగాహన రాకుండానే పదవుల కోసం జనసేనలో అంతర్గత రాజకీయాలు ఊపందుకోవడం చర్చకు తావిస్తోందని అంటున్నారు.రాష్ట్రంలో 123 మున్సిపాలిటీలు ఉండగా, జనసేన ఎన్ని స్థానాల్లో పోటీ చేస్తుందనేది అంతుచిక్కని అంశంగా ఉందని వ్యాఖ్యానిస్తున్నారు. అదేవిధంగా 28 జిల్లా పరిషత్తులలో ఎన్నిస్థానాలను జనసేన తీసుకుంటుంది అనేది ఆసక్తి రేపుతోందని అంటున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి కోసం తాము కాస్త తగ్గామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ చెబుతున్నారు. అంటే స్థానిక ఎన్నికల్లో తాము తగ్గే పరిస్థితి లేదని ఆయన పరోక్షంగా చెబుతున్నారా? అని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. జనసేనాని పవన్ వ్యాఖ్యలు, జనసైనికుల అభిప్రాయాలను పరిశీలిస్తే స్థానిక ఎన్నికల్లో కూటమిలో టీడీపీతో సమానంగా పోటీకి సై అంటున్నట్లు కనిపిస్తోందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. మరికొందరు మాత్రం తమకు 40 శాతం సీట్లు ఇవ్వాలని జనసేన కోరుకుంటోందని అంటున్నారు.ఈ ప్రచారమే నిజమైతే జనసేన రాష్ట్రంలో 50కి పైగా మున్సిపాలిటీలు, 10 నుంచి 14 జిల్లా పరిషత్తు స్థానాలను కోరుకుంటున్నట్లేనని వ్యాఖ్యానిస్తున్నారు. అయితే ఈ స్థాయిలో జనసేనకు కేటాయించేందుకు టీడీపీ సమ్మతిస్తుందా? అన్నదే చూడాల్సివుందని అంటున్నారు. మరోవైపు స్థానిక ఎన్నికల్లో బలం ఉన్న అన్నిస్థానాల్లో పోటీ చేస్తామని జనసేన ప్రకటించడాన్ని టీడీపీ సీనియర్లు తప్పుపడుతున్నారని ప్రచారం జరుగుతోంది. పొత్తులో ఉన్నప్పుడు ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు ఇలాంటి మాటలు ఆడటం సరికాదని వ్యాఖ్యానిస్తున్నారు. పొత్తులపై మూడు పార్టీల సమన్వయ సమావేశం ముగిసిన తర్వాతే ఎవరైనా పోటీపై ప్రకటన చేయాలని అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికల్లో పోటీపై జనసేన వ్యూహం ఎలా ఉంటుందనేది ఆసక్తి రేపుతోందని చెబుతున్నారు.

# నాగబాబు ఆన్ డ్యూటీ.. ఏపీ గ్రీన్ చైర్మన్ గా బాధ్యతల స్వీకరణ

**విశాఖపట్టణం, ఆగస్టు 28, పెన్ పవర్:**జనసేన ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలో పచ్చదనం పెంపు, పర్యావరణ పరిరక్షణ నిమిత్తం ఏర్పాటు చేసిన ఈ కమిటీ చైర్మనుగా కేబినెట్ హోదాలో నాగబాబు సేవలు అందించనున్నారు. ఏపీ గ్రీన్ చైర్మన్ గా నాగబాబును నియమిస్తూ దాదాపు 20 రోజుల క్రితమే ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే మంచి ముహూర్తం కోసం ఇన్నాళ్లు ఎదురుచూసిన నాగబాబు శ్రావణ శుక్రవారం సందర్భంగా పండితుల వేది మంత్రోచ్చారణల మధ్య బాధ్యతలు స్వీకరించారు.

మంగళగిరిలోని అరణ్య భవన్ లో ఏపీ గ్రీన్ చైర్మనుగా నాగబాబు బాధ్యతలు స్వీకరించారు. ఈ సమయంలో నాగబాబు పక్కనే ఆయన భార్య పద్మజ ఉన్నారు. పలువురు జనసేన నాయకులు, అటవీశాఖ అధికారుల సమక్షంలో నాగబాబు బాధ్యతల స్వీకరణ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న అటవీ, వృక్ష సంపదను విస్తరించి 2047 నాటికి మొత్తం భౌగోళిక విస్తీర్ణంలో పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యంగా పని చేస్తానని నాగబాబు తెలిపారు. పర్యావరణ పరిరక్షణను కేవలం ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ప్రజలందరూ భాగస్వామ్యమయ్యే మహోద్యమంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

**50 శాతం పచ్చదనం పెంచుతా..**

ప్రస్తుతం రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం 22.96 శాతంగా ఉందని, 2047 నాటికి పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే మా ప్రధాన లక్ష్యమని




నాగబాబు స్పష్టం చేశ్శు. ఇది కేవలం గణాంకాల కోసం పెట్టుకున్న లక్ష్యం కాదని, భావి తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన పర్యావరణం, మెరుగైన జీవన ప్రమాణాలు అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమమని ఆయన అభివర్ణించారు. వాతావరణ మార్పులు ప్రపంచానికి సవాలుగా మారుతున్న ఈ సమయంలో పర్యావరణ పరిరక్షణ అనేది మనందరి బాధ్యతగా నాగబాబు వ్యాఖ్యానించారు. కాగా, ఏపీ గ్రీన్ కార్యక్రమాన్ని కేవలం ప్రభుత్వ కార్యక్రమంగా మాత్రమే కాకుండా ప్రతి పౌరుడిని భాగస్వాములను చేసేలా పనిచేస్తామన్నారు.

**నాగబాబు కాదు నాగేంద్రరరావు**

ఏపీ గ్రీన్ చైర్మనుగా నాగబాబు ప్రమాణస్వీకారం చేసిన సమయంలో ఆయన టేబుల్ పై ఏర్పాటు చేసిన నేమ్ బోర్డు చర్చకు తావిచ్చింది. సినీ రంగంలో నాగబాబుగా అందరికీ తెలిసిన నాగబాబు అసలు పేరు నాగేంద్రరావు అన్న విషయం శుక్రవారమే స్పష్టమైంది. ఎమ్మెల్సీగా నాగబాబు ఎన్నికైన అప్పటికీ అందరూ ఆయనను నాగబాబు అనే వ్యవహారిక నామంతోనే పిలుస్తున్నారు. కానీ, అధికారికంగా నాగబాబు అసలు పేరు నాగేంద్రరరావు అని సూచిస్తూ నేమ్ బోర్డు ఏర్పాటు చేశారు. "కొణిదెల నాగేంద్రరరావు, చైర్మన్, ఎగ్జిక్యూటివ్ కమిటీ, ఏపీ గ్రీన్ అంటూ బోర్డుపై స్ఫష్టంగా రాశారు. కాగా, చైర్మనుగా బాధ్యతలు స్వీకరించిన నాగబాబుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ట్విటర్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.

# సోనల్ దినుష అద్భుతం.. ప్రత్యేకంగా అభినందించిన గౌతమ్ గంభీర్

**లంక యువ బ్యాటర్ సోనల్ దినుషపై గంభీర్ ప్రశంసలు**

**భారత్‌తో రెండో టెస్టును ఒంటిచేత్తో డ్రా చేసిన దినుష**

**టెస్ట్ సిరీస్‌ను 1-0 తేడాతో గెలుచుకున్న టీమిండియా**




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత జట్టు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, ప్రత్యర్థి జట్టులోని ఓ యువ ఆటగాడిపై ప్రశంసల వర్షం కురిపించాడు. శ్రీలంక యువ సంచలనం సోనల్ దినుష అసాధారణ పోరాటపటిమను ప్రత్యేకంగా అభినందిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. భారత్‌తో రెండో టెస్టును ఒంటిచేత్తో డ్రాగా ముగించిన అతడి ఆటతీరును గంభీర్ మెచ్చుకున్నాడు. ఈ సిరీస్‌ను భారత్ 1-0తో గెలుచుకున్నప్పటికీ, దినుష ప్రదర్శన అందరి దృష్టిని ఆకర్షించింది.శుక్రవారం తన 'ఎక్స్' ఖాతాలో గంభీర్ స్పందిస్తూ.. "టెస్ట్ క్రికెట్‌కు పట్టుదల, ఓపిక, మానసిక దృఢత్వం చాలా అవసరం. మన కుర్రాళ్లు దానిని ప్రదర్శించారు! అయితే, సోనల్ దినుష అసాధారణ ప్రదర్శనకు ప్రత్యేక అభినందనలు!" అని పేర్కొన్నాడు.కొలంబోలోని సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో గురువారం ముగిసిన రెండో టెస్టులో, టీమిండియా విజయం అంచున నిలిచింది. అయితే, లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ సోనల్ దినుష అద్భుతమైన సెంచరీతో లంకను ఆదుకున్నాడు. ఫాలో ఆన్ ఆడుతూ కష్టాల్లో పడిన జట్టును తన అజేయమైన 133 పరుగుల (264 బంతుల్లో) ఇన్నింగ్స్‌తో గట్టెక్కించాడు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఫలితంగా భారత్ 2-0తో సిరీస్ క్లీన్‌స్వీప్ చేసే అవకాశాన్ని కోల్పోయింది. అంతకుముందు గాలెలో జరిగిన తొలి టెస్టులో భారత్ 165 పరుగుల తేడాతో గెలిచిన సంగతి తెలిసిందే.

**రికార్డుల మోత మోగించిన దినుష**

ఈ సిరీస్‌లో సోనల్ దినుష అద్భుత ఫామ్‌తో చెలరేగాడు. మొత్తం నాలుగు ఇన్నింగ్స్‌లలో ఏకంగా 420 పరుగులు సాధించాడు. ఇందులో 3 సెంచరీలు, ద

ఒక హాఫ్ సెంచరీ (84) ఉన్నాయి. ఈ క్రమంలో పలు అరుదైన రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. ఆరో స్థానం లేదా అంతకంటే దిగువన బ్యాటింగ్‌కు వచ్చి ఒకే టెస్టులో రెండు సెంచరీలు చేసిన నాలుగో శ్రీలంక ఆటగాడిగా నిలిచాడు. అలాగే, ఒకే టెస్టులోని రెండు ఇన్నింగ్స్‌లలోనూ శతకాలు బాదిన ఎనిమిదో శ్రీలంక క్రికెటర్‌గా రికార్డు సృష్టించాడు. రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో మూడు సెంచరీలు నమోదు చేసిన మూడో లంక బ్యాటర్‌గా అరవింద డిసిల్వా, కుమార సంగక్కర సరసన చేరాడు.

# టెస్టుల్లో నా సత్తా ఏంటో చూపించా: పడిక్కల్ హ్యాపీ

- టెస్టుల్లో పెద్ద స్కోర్లు చేయగలనని నిరూపించుకున్న పడిక్కల్
- శ్రీలంక సిరీస్‌లో 328 పరుగులతో అదరగొట్టిన బ్యాటర్
- 109.33 సగటుతో రెండు సెంచరీలు చేసిన పడిక్కల్
- స్పిన్‌ను ఎదుర్కొనేందుకు ముందే ప్రత్యేకంగా సిద్ధమైనట్లు వెల్లడి
- శ్రీలంకలో పరిస్థితులు సవాలుగా ఉన్నాయన్న పడిక్కల్



**హైదరాబాద్ పెన్ పవర్:** టెస్టు క్రికెట్‌లో తాను పెద్ద స్కోర్లు చేయగలనని నిరూపించుకోవడం ఎంతో సంతృప్తినిచ్చిందని భారత బ్యాటర్ దేవ్‌దత్ పడిక్కల్ అన్నాడు. శ్రీలంకతో 1-0తో సిరీస్ గెలవడంలో తన ప్రదర్శన పట్ల సంతోషం వ్యక్తం చేశాడు. దేశవాళీ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో ఏళ్లుగా సాధించిన నిలకడే టెస్టుల్లోనూ రాణించేందుకు ఉపయోగపడిందని చెప్పాడు.సాయి సుదర్శన్ గాయపడటంతో మూడో స్థానంలో బ్యాటింగ్ చేసిన పడిక్కల్ రెండు టెస్టుల్లో 328 పరుగులు చేశాడు. 109.33 సగటుతో రెండు సెంచరీలు సాధించాడు. ఈ సిరీస్‌లో తనకు అవకాశం వస్తుందని తెలిసినప్పటి నుంచే దాని కోసం ఎదురుచూశానని తెలిపాడు. తన సత్తా ఏంటో చూపించేందుకు ఇదే సరైన అవకాశమని భావించానని చెప్పాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో పెద్ద స్కోర్లు చేసినట్లే టెస్టుల్లోనూ చేయగలిగానని ఆనందం వ్యక్తం చేశాడు. ఈ సిరీస్ ఇచ్చిన నమ్మకంతో కెరీర్‌లో ముందుకు సాగుతానని అన్నాడు.శ్రీలంకలో వేడి, ఉక్కపోత పరిస్థితులు జట్టుకు సవాలుగా నిలిచాయని పడిక్కల్ చెప్పాడు. పరిస్థితులు అంత సులభంగా లేకపోయినా మొత్తం జట్టు వంద శాతం కష్టపడిందని ప్రశంసించాడు. అందరూ ఒకే లక్ష్యంతో ఆడటం మంచి సంకేతమని పేర్కొన్నాడు.శ్రీలంక స్పిన్నర్లను ఎదుర్కోవడంపై సిరీస్‌కు ముందే ప్రత్యేకంగా సిద్ధమయ్యానని పడిక్కల్ వెల్లడించాడు. అక్కడ స్పిన్‌ను ఎదుర్కోవడం పెద్ద సవాలుగా ఉంటుందని ముందే తెలుసని చెప్పాడు. అందుకు తగ్గట్టుగా సాధన చేయడం వల్ల మంచి ఫలితం వచ్చిందని తెలిపాడు. ఇకపైనా స్పిన్‌ను ఎదుర్కొనే విషయంలో మరింత మెరుగవుతానని అన్నాడు.

రెండో టెస్టులో శ్రీలంక బ్యాటర్లు అద్భుతంగా పోరాడారని పడిక్కల్ ప్రశంసించాడు. సోనల్, కేశర బ్యాటింగ్ అసాధారణంగా ఉందన్నాడు. భారత బౌలర్లు తమ శక్తిమేరకు ప్రయత్నించారని చెప్పాడు. అయితే శ్రీలంక ఆటగాళ్లు మంచి క్రికెట్ ఆడి డ్రా చేసుకున్నారని పేర్కొన్నాడు.

# కుర్రాళ్ల జోరుకు గిల్ ఫుల్ ఖుషీ.. భారత్‌కు కొత్త బలం!

**శ్రీలంకపై 1-0తో సిరీస్ గెలిచిన భారత్**

**యువ ఆటగాళ్ల ప్రదర్శనపై గిల్ సంతోషం**

**పడిక్కల్ రెండు సెంచరీలతో 328 పరుగులు**

**సిరీస్‌లో మానవ్ సుతార్ కు 16 వికెట్లు**

**గాలే టెస్టులో సుతార్‌కు పది వికెట్ల ఘనత**

**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీలంకపై టెస్టు సిరీస్ గెలిచిన తర్వాత భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సంతోషం వ్యక్తం చేశాడు. రెండు టెస్టుల సిరీస్‌లో 1-0తో విజయం సాధించడం ఆనందంగా ఉందన్నాడు. రెండో టెస్టు డ్రాగా ముగిసినా, ఈ పర్యటనలో జట్టుకు ఎన్నో మంచి అంశాలు కనిపించాయని తెలిపాడు. ముఖ్యంగా యువ ఆటగాళ్లు దేవ్‌దత్ పడిక్కల్, మానవ్ సుతార్ రాణించడం తనను ఆకట్టుకుందని చెప్పాడు.సాయి సుదర్శన్ స్థానంలో మూడో నంబర్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన పడిక్కల్ సిరీస్‌లో అదరగొట్టాడు. రెండు సెంచరీలతో 328 పరుగులు చేశాడు. క్రీజులో నిలదొక్కుకున్న తర్వాత పెద్ద ఇన్నింగ్స్‌లు ఆడాలని బ్యాటర్లకు చెబుతుంటామని గిల్ అన్నాడు. పడిక్కల్ అదే చేసి చూపించాడని ప్రశంసించాడు. అతడి ఆట జట్టుకు మంచి సంకేతమని తెలిపాడు.ఎడమచేతి స్పిన్ ఆల్‌రౌండర్ మానవ్ సుతార్‌పైనా గిల్ ప్రశంసలు




కురిపించాడు. సిరీస్‌లో 16 వికెట్లు తీసిన సుతార్ గాలే టెస్టులో పది వికెట్లతో భారత్ 165 పరుగుల విజయానికి కీలకంగా నిలిచాడు. అతడు భవిష్యత్తులో భారత స్పిన్ దాడికి చాలా కాలం నాయకత్వం వహించే ఆటగాడిగా ఎదుగుతాడని గిల్ విశ్వాసం వ్యక్తం చేశాడు. బౌలింగ్‌కు వచ్చిన ప్రతిసారీ వికెట్లు తీసే అవకాశం కల్పిస్తున్నాడని అన్నాడు.రెండో టెస్టు డ్రా కావడం మాత్రం నిరాశ కలిగించిందని గిల్ చెప్పాడు. రెండో రోజు ఆట ముగిసే సరికి గెలుస్తామని భావించామని తెలిపాడు. కానీ చివరి మూడు రోజులు శ్రీలంక అద్భుతంగా పోరాడిందని ప్రశంసించాడు. ప్రత్యర్థి ఆట నుంచి కూడా పాఠాలు నేర్చుకోవాలని అన్నాడు. ఈ సిరీస్ నుంచి మంచి అనుభవం దక్కిందని, న్యూజిలాండ్‌తో జరిగే సిరీస్‌లో మరింత మెరుగ్గా ఆడతామని గిల్ ధీమా వ్యక్తం చేశాడు.

# 'ఆయా షేర్' తర్వాత.. ఏం ప్లాన్ చేశారయ్యా

నాని 'ది ప్యారడైజ్' నుంచి ఫస్ట్ వచ్చిన 'ఆయా షేర్' పాట తన పని చేసేసింది. సినిమా ఎలా ఉండబోతోందనే విషయాన్ని పూర్తిగా చెప్పకుండానే, నాని పాత్రను ఒక రేంజ్‌లో పరిచయం చేశారు. అనిరుధ్ మ్యూజిక్, కాసర్ల శ్యామ్ లిరిక్స్ కూడా పాటను జనాల్లోకి తీసుకెళ్లాయి. ఇప్పుడు రెండో సింగిల్ దగ్గరకు వచ్చేసరికి అదే టీమ్ నుంచి మరో చిన్న హింట్ బయటకు వచ్చింది.ఈసారి కాసర్ల శ్యామ్ ముందుగా ఓ క్లారిటీ ఇచ్చాడు. రెండో పాట ఫైనల్ అవుట్‌పుట్ విన్న తర్వాత "DJ Anirudh bolthe.. Lit K Ramp" అంటూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టాడు. అనిరుధ్, నాని, శ్రీకాంత్ ఓదెలతో పాటు 'ది ప్యారడైజ్' టీమ్‌ను ట్యాగ్





చేశాడు. పాట పేరు కానీ, ట్యూన్ ఎలా ఉంటుందనే విషయం కానీ చెప్పలేదు. కానీ ఫైనల్ వెర్షన్ రెడీ అయిందనే విషయం మాత్రం ఈ పోస్ట్‌తో బయటకు వచ్చింది.ఇక్కడ మేకర్స్ ఎలాంటి పాటను ఎంచుకున్నారన్నది హాట్ టాపిక్ గా మారింది'ఆయా షేర్'ను రెగ్యులర్ సినిమా పాటలా వదలకుండా, నాని పాత్ర జడల్ ప్రపంచాన్ని ముందుగా పరిచయం చేసేలా తీసుకొచ్చారు. అందుకే రెండో పాట కూడా కథలో ఏ భాగాన్ని ముందుకు తీసుకొస్తుందన్నది తెలియాల్సి ఉంది.పైగా ఈ పాటకు కూడా కాసర్ల శ్యామ్ పనిచేయడం మరో కామన్ పాయింట్. 'ఆయా షేర్'లో ఆయన వాడిన పదాలు, అనిరుధ్ ఇచ్చిన బీట్ కలిసి ప్రత్యేకమైన స్టైల్‌లో వెళ్లాయి. ఇప్పుడు అదే ఇద్దరూ మరోసా( కలవడంతో మొదటి పాట తరహాలోనే వెళ్తారా, లేక పూర్తిగా వ టోన్ పట్టుకుంటారా అన్నది పాట వచ్చాకే తెలుస్తుంది.'దసరా తర్వాత నాని, శ్రీకాంత్ ఓదెల కలిసి చేస్తున్న సినిమా కావడంతో 'ది ప్యారడైజ్' ప్రతి అప్డేట్‌ను మేకర్స్ కాస్త ప్లాన్‌తోనే బయటకు తీసుకొస్తున్నారు. ఒకేసారి ఎక్కువ విషయాలు చెప్పకుండా, ముందు నాని లుక్, తర్వాత 'ఆయా షేర్', ఇప్పుడు రెండో సింగిల్ అంటూ ఒక్కోటి బయటకు వస్తోంది.ప్రస్తుతం రెండో పాటకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా చెప్పలేదు. అయితే ఫైనల్ అవుట్‌పుట్ వరకు పని వచ్చేసిందని కాసర్ల శ్యామ్ పోస్ట్‌తో క్లియర్ అయింది. 'ఆయా షేర్'తో మొదటి పాటను ఒక రూట్‌లో తీసుకెళ్లిన టీమ్, ఇప్పుడు రెండో పాట కోసం ఏం ప్లాన్ చేసిందన్నదే నెక్స్ట్.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at Dno 6-5-25, medara bazar, 16 th ward, near Oid bus stand, Bapatla editor GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2233, editorpenpower@gmail.com